# భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 79 | హైదరాబాద్ | మంగళవారం 09-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00





తెలంగాణ గ్రూప్ 1 పిటిషన్లపై తీర్పు వెలువరించనున్న హైకోర్టు

## నేటి భారతం

- ప్రశ్న ఏదైనా ప్రేమతో బదులిస్తే, మనం గడిపే ప్రతిరోజు అందంగా ఉంటుంది.
- బదులిచ్చే విధానంతో సగం ప్రపంచాన్ని గెలిచేయవచ్చు.
- "నీ జీవితమే నీకు టీచర్.. నీ జీవనగమనంలో అది నిరంతరం పాఠాలు నేర్పుతూనే ఉంటుంది"
- ఆ పాఠాలను సరిగా అర్థం చేసుకుంటే చాలు.. సమయాన్ని గౌరవించడం ఆ పాఠాల ముఖ్య సారాంశం..
- "నువ్వు నిజంగా జీవితాన్ని ప్రేమిస్తుంటే.. సమయాన్ని వృథా చేయవద్దు.. ఎందుకంటే జీవితాన్ని నిర్దేశించేది సమయమే"
- ఇక మనసును ఎప్పుడూ నిర్మలంగా ఉంచుకోవాలి.. ఆందోళన అనేది పరిష్కారం కాకూడదు..
- మీ మనసు ఎంత నిర్మలంగా ఉంటే... దానిని నియంత్రించడం అంత సులభం..
- నియంత్రణలో ఉంటే మనసు ఎంతో శక్తివంతమైనది..

– అక్కిరాజు శ్రీనివాస్

# అవినీతినే తన స్టాంపుగా మార్చుకున్న
# స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ..




ప్రజలతో నేరుగా సంబంధాలు.. వారి అవసరాలు.. ముఖ్యంగా భూ వ్యవహారాలు.. రిజిస్ట్రేషన్లు.. స్థిరాస్థికి రక్షణ కల్పించడం.. భూ యజమానులు గుర్తించడం.. నిజాయితీగా సంరక్షించడం.. ఈ గురుతర బాధ్యతలు నిర్వహిస్తుంది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ.. అంతే కాదు.. ప్రభుత్వానికి అత్యంత కీలకమైన ఆదాయ వనరులను సమకూరుస్తుంది.. స్టాంప్ డ్యూటీల పేరుతో నిజాయితీగా ప్రజలనుండి ఫీజుగా సేకరించి, ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తుంది.. జమ అయిన ఈ నిధులు తిరిగి ప్రజా అవసరాలకోసం, ప్రజా సౌకర్యాలకు ప్రభుత్వం వినియోగిస్తుంది.. కానీ ఈ శాఖలో ఇప్పుడు పరిస్థితులు అంతా తారుమారుగా ఉన్నాయి.. ప్రభుత్వ ఖజానాకు చేరవలసిన సొమ్ము కొందరు అవినీతి అధికారుల బొక్కసానికి చేరుతోంది.. నిజాయితీగా జరగాల్సిన పనులు అవినీతికి ఆలవాలమై పోయాయి.. లంచం, లంచం, లంచం.. లంచమనే ఈ మహమ్మారి ఈ శాఖలో వేళ్ళూనుకుపోయింది.. పైసా లేనిది ఫైల్ కదలడం లేదు.. ఒరిజినల్ పత్రాలు లేకపోయినా.. కరెన్సీ నోట్లు ఉంటే చాలు.. మీరు కోరుకున్న భూమి మీపేరుమీద రిజిస్ట్రేషన్ అయిపోతుంది.. అధికారులకు అమ్యామ్యాలు చెల్లిస్తే చాలు.. ప్రభుత్వానికి కట్టాల్సిన స్టాంప్ డ్యూటీ కూడా స్వల్పంగా కట్టి తప్పించుకోవచ్చు.. కీలకమైన ఈ శాఖ పూర్తిగా అవినీతిమయం అయిపోయింది.. దారుణం ఏమిటంటే ఎంతో కీలకమైన స్టాంప్ పేపర్లు సైతం నకిలీవి పుట్టుకొస్తున్నాయి.. ఈ వ్యవహారంలో తెలంగాణకు చెందిన ఒక మంత్రి సైతం ఇరుక్కుని డిస్మిస్ అయిన సంగతి మనం చూశాం.. నకిలీ స్టాంప్ పేపర్ల వ్యవహారం దేశ వ్యాప్తంగా అప్పుడు సంచలనం రేకెత్తించింది.. ఈ వ్యవహారంలో కీలకమైన అధికారులు కూడా తమవంతు పాత్రను పోషించడం మనం చూసాం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటి కాదు రెండు కాదు అనేకానేక అక్రమాలు ఈ శాఖలో నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి..




## 70కి పైగా బీసీ కుల సంఘాల నేతలతో కవిత భేటీ

- బీసీ హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన కవిత
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను విస్మరించారని ఆరోపణ
- 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించిన అధిష్ఠానం

11లో

## మూసీ ప్రక్షాళన ద్వారా
## తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది

- ఉస్మాన్ సాగర్ వద్ద గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన
- నగర ప్రజల దాహార్తి తీర్చడానికే ఈ పథకం తీసుకువచ్చామన్న ముఖ్యమంత్రి
- సమస్యలు సృష్టించినా సమన్వయంతో ముందుకు వెళతామని వ్యాఖ్య







## జీ20 దేశాల్లో భారత్‌దే రికార్డ్..

- జీ20 దేశాల్లోనే అత్యల్పంగా భారత్‌లో నిరుద్యోగ రేటు
- కేవలం 2 శాతంగా ఉందని వెల్లడించిన కేంద్ర మంత్రి మాండవీయ

## భారత్‌ను చూసి నేర్చుకోండి..
## మోదీ పాలసీపై ఇజ్రాయెల్ నిపుణుడి ప్రశంసలు

- 'దేశ గౌరవం'ను వ్యూహాత్మక ఆస్తిగా మార్చుకోవడంలో మోదీ విజయం సాధించారన్న జకి షలోమ్
- ట్రంప్ ఫోన్ కాల్స్‌ను కూడా తిరస్కరించిన మోదీ వైఖరిపై ప్రశంసలు
- ఇజ్రాయెల్ స్పందన గందరగోళంగా ఉంటోందని నిపుణుడి విమర్శ

11లో






## ఏపీలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ...

- టీటీడీకి కొత్త ఈవో
- రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ లకు స్థానచలనం
- టీటీడీ నూతన ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్ నియామకం
- ప్రస్తుత ఈవో శ్యామలరావు జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ
- రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబు
- పనితీరు ఆధారంగా బదిలీలు చేపట్టిన ప్రభుత్వం

11లో

## ఉప రాష్ట్రపతి ఎన్నికలు...
## బీఆర్ఎస్ బాటలో మరో పార్టీ

- ఉపరాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్‌కు దూరంగా ఉండాలని బీజేడీ నిర్ణయం
- ఎన్డీయే, ఇండియా కూటములకు సమదూరం పాటించాలన్నదే తమ విధానమని వెల్లడి
- ఇప్పటికే ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించిన బీఆర్ఎస్



భారతశక్తి

## ఇరాన్ కర్మ ఫలితం అనుభవిస్తోందా....

16 ఏళ్ల అత్యాచార బాధితురాలి శాపమే ఇరాన్ ని పట్టిపీడిస్తోందా? సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ఎంతవరకూ కరెక్ట్? శాపాలు తగులుతాయా అసలు? భగవద్గీతలో శ్రీ కృష్ణుడు చెప్పిన కర్మ ఫలం అంటే ఇదేనా?16 ఏళ్ల అతేఫా సహాలేహ్ కి ఇరాన్ కోర్టు ఉరిశిక్ష విధించింది,అందరూ చూస్తుండగా బాలికను బహిరంగంగా ఉరితీశారు. ఆమె తప్పు చేయలేదు..పైగా బాధితురాలు.అత్యంత పాశవికంగా అత్యాచారానికి గురైందిజఆమెకు న్యాయం చేయాల్సిందిపోయి ఉరితీశారుఈ ఘటనతో ఇరాన్ దేశం మొత్తం అట్టుడికింది..ఇంత దారుణమా అని ప్రపంచ దేశాలన్ని బాలికకు మద్దతుగా గొంతెత్తాయి...రెండు దశాబ్ధాల క్రితం ఇరాన్ న్యాయస్థానం అమలు చేసిన ఉరిశిక్ష సంచలనం రేపిందిమళ్లీ ఇప్పుడు ఆ విషయాన్ని మరోసారి గుర్తుచేసుకుంటున్నారు నెటిజన్లు...నిండు సభలో ద్రౌపదిని అవమానించినందుకు ప్రతిగా కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. మహిళను అవమానించిన వారుమాత్రమే కాదు చూస్తూ ఊరుకున్నవారు కూడా అంతమైపోయారుమాయావిగా వచ్చి సీతాదేవిని ఎత్తుకెళ్లిన రావణుడికి, లంకేయులకు ఎలాంటి గతి పట్టిందో రామాయణంలో ఉందిఇప్పుడు ఆ బాలికకు జరిగిన అన్యాయమే..ఇరాన్ ను శాపమై పట్టిపీడిస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఆ బాలికకు చేసిన అన్యాయానికి ఇన్నేళ్ల తర్వాత తగిన మూల్యం చెల్లించుకుంటోంది. ఇజ్రాయెల్ దాడులతో వందలమంది ఇరానియన్ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారంటే ఆ 16 ఏళ్ల బాలిక శాపమేనా అని సోషల్ మీడియాలో డిస్కషన్ జరుగుతోంది. 2004లో జరిగిన ఈ సంఘటన తర్వాత నుంచి ఇరాన్ ప్రజలకు కష్టాలు మొదలయ్యాయంటున్నారు. ప్రస్తుత పరిస్థితి కూడా ఈ కోవకే చెందుతుందని ఆనాడు జరిగిన సంఘటనను మరోసారి గుర్తుచేసుకుంటున్నారు. ఇరాన్ లో నేకా నగరానికి చెందిన అతేఫా సహాలేహ్ కి పవిత్రతకు వ్యతిరేకంగా నేరం చేసిందంటూ మరణశిక్ష విధించారు. వాస్తవానికి ఇతర దేశాల్లో అత్యాచారానికి గురైతే బాధితురాలిగా పరిగణిస్తారు. కానీ ముస్లిం దేశం అయిన ఇరాన్ లో కన్యత్వాన్ని కోల్పోయినందుకు ఆమె దోషిగా నిలబడాల్సి వచ్చింది. కనీసం ఆమె ఆవేదన ఏంటో చెప్పుకునే అవకాశం కల్పించకుండానే నేరస్థురాలిగా తీర్మానించారు. అప్పటికీ ఆమె హిజాబ్ తొలగించి తన బాధను చెప్పుకునే ప్రయత్నం చేసింది కానీ దాన్ని కూడా తప్పుగా పరిగణించింది న్యాయస్థానం. ఉరిశిక్ష విధించడమే కాదు బహిరంగంగా అమలుపర్చారు.అతేఫా సహాలేహ్ చిన్నప్పుడే తల్లిదండ్రులను ఓ ప్రమాదంలో కోల్పోయింది. సోదరుడు నదిలో పడి చనిపోయాడు. అమ్మమ్మ తాతయ్య దగ్గర పెరిగింది అతేఫా. కుటుంబ సభ్యులంతా కూలికోసం ఇంటికి దూరంగా వెళ్లాల్సి వచ్చేది. ఇంట్లో ఒంటరిగా ఉండేది 15 ఏళ్ల అతేఫా. ఇది గమనించాడు పక్కింట్లో ఉన్న 51ఏళ్ల అలీ. ఒంటరిగా ఉన్న ఆమెను అత్యాచారం చేయడమే కాదు ఈ విషయం ఎవరితో అయినా చెబితే చంపేస్తానని బెదిరించి వందలసార్లు శారీరికంగా హింసించాడు. ఆ బాధను భరించలేకపోయిన అతేఫా పోలీసులను ఆశ్రయించింది. ఇదే ఆమెకు శాపమైంది. కన్యత్వాన్ని పోగొట్టుకున్న మహిళ..షరియా చట్టం ప్రకారం బాధితురాలు కాదు నేరస్తురాలు. ఈ నేరం కిందే ఆమెను జైల్లో పెట్టారు. అక్కడ కూడా లైంగిక వేధింపులకు గురైంది అతేఫా సహాలేహ్. ఈ విషయం న్యాయస్థానం వరకూ చేరింది కానీ ఆమెకు న్యాయం జరగలేదు సరికదా కన్యత్వాన్ని కోల్పోయిన నేరం కింద ఉరితీశారు. అతేఫా సహాలేహ్ ని ఉరితీసేనాటికి ఆమె వయసు 22 ఏళ్లని , వ్యభిచార నేరానికి పాల్పడిందని కోర్టు చెప్పింది. కానీ ఆమె వయసు 16 సంవత్సరాలు అని కొందరి వాదన. ఇరానియన్ చట్టాల ప్రకారం 18 సంవత్సరాల కన్నా తక్కువ వయసు ఉన్నవారిని ఉరితీయకూడదు. అతేఫా సహాలేహ్ విషాద గాథను ఓ వ్యక్తి ఎక్స్ లో పోస్ట్ చేశాడు. అతేఫాను ఉరితీసినప్పటి నుంచీ ఇరాన్ ప్రజలకు శాంతి లేదని పోస్ట్ లో పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇరాన్ లో పరిస్థితికి కూడా ఆ బాలిక శాపమే కారణం అనే చర్చ జరుగుతోంది. అతేఫా కథ విన్నవారంతా ఇదేం న్యాయం? ఇదెక్కడి చట్టం? ఇంత అన్యాయమా? ఆమె శాపం తగిలింది అనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదంటున్నారు. శాపాలు, పాపాలు తగలడంలో వాస్తవం ఎంత అంటే ప్రూవ్ చేసే సాక్ష్యాలు లేకపోవచ్చేమో..కానీ చేసిన కర్మకు తగిన ఫలితం అనుభవించక తప్పదని భగవద్గీతలో శ్రీ కృష్ణుడు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. మరోవైపు శాంతి పరిస్థితులు ఏర్పడినందుకు ఇరాన్ మాత్రం అణ్వాయుధాల ప్రస్తావనే చేయొద్దని అమెరికా హెచ్చరించింది. ఇదే విషయాన్ని ట్రంప్ ప్రకటించారు. అయితే ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయలేదనే డోనాల్డ్ ట్రంప్ వాదనను ఇరాన్ అణుశక్తి సంస్థ తోసిపుచ్చింది. ఇరాన్ అణు కార్యక్రమం ఎటువంటి అడ్డంకులు లేకుండా తిరిగి ప్రారంభమవుతుందని, యురేనియం సుసంపన్నతను తిరిగి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ఈ యుద్ధ వాతావరణంతో ఇరు దేశాలు భారీగానే నష్టపోయాయి. 24 మంది ఇజ్రాయెలీలు ప్రాణాలు కోల్పోగా వెయ్యిమందికిపైగా గాయాలు పాలయ్యారు. ఆస్తినష్టం సరేసరి. 974 మంది ఇరానియన్లు మృతి చెందగా.. మూడు వేలకుపైగా ప్రజలు గాయపడ్డార. భారీగా ఆస్తులు ధ్వంసం అయ్యాయి. వీటికి తోడు వేల మంది విదేశీయులు అక్కడి నుంచి తరలిపోయారు. ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య పరిస్థితులు చక్కబడటంతో చాలా దేశాలు తమ గగన తలాలను తెరుస్తున్నాయి. గల్ఫ్ దేశాలన్నీ మంగళవారం ఉదయానికి సాధారణ విమాన సేవలు పునరుద్ధరించాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత, ఇజ్రాయెల్ రక్షణ దళం కీలక నిర్ణయం తీసుకుంది.

# రాజకీయంగా సైడ్ చేసినట్టేనా

రాజమండ్రి, సెప్టెంబరు 8

సీనియర్ తెలుగు దేశం పార్టీ నేత అయిన గోరంట్ల బుచ్చయ్య చౌదరికి ఇదే ఎమ్మెల్యేగా ఆఖరి అవకాశమని పార్టీ వర్గాల్లోనే చర్చ జరుగుతుంది. ఆయన వయసు ఇప్పటికే దాటి పోవడంతో పాటు తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించడంతో వచ్చే ఎన్నికల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరికి టిక్కెట్ దక్కడం కూడా కష్టమేనంటున్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఏదైనాపెద్దల సభకు పంపవచ్చన్న సంకేతాలు వెలువడుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకు మాత్రమే కాకుండా 2029 ఎన్నికల్లో ప్రధానంగా యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇప్పటికే పార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఇప్పటికే యనమల రామకృష్ణుడి వంటి దిగ్గజ నేతలనే పక్కన పెట్టింది. దీంతో గోరంట్ల బుచ్చయ్య చౌదరిని రాజకీయంగా సైడ్ చేస్తారేమోనన్న టాక్ బలంగా వినిపిస్తుంది. రాజకీయాల్లో సీనియర్ నేతగా ఆయన అందరికీ సుపరిచితుడే. ప్రకాశం జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లాకు వచ్చి స్థిరపడిన కుటుంబమయినప్పటికీ రాజకీయంగా బుచ్చయ్య చౌదరి నిలదొక్కుకున్నారు. కమ్మ సామాజికవర్గం నేతగా ఉన్నప్పటికీ కాపులు, బీసీలు బలంగా ఉన్న చోట ఆయన అన్నిసార్లు విజయం సాధించారంటే ఆయన పట్టుదలకు, రాజకీయ చాణక్యానికి నిదర్శనమని చెప్పాలి. ఆయన పోటీ చేసినప్పుడు గెలుపులు అత్యధింగా ఉంటాయి. ఓటమి అనేది చాలా తక్కువ సార్లు ఉంది. రాజమండ్రి పట్టణ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు గెలిచిన గోరంట్ల బుచ్చయ్య చౌదరి రాజమండ్రి రూరల్ కు వెళ్లి పోటీ చేసినా రెండు సార్లు విజయం సాధించారు. దాదాపు ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బుచ్చయ్య చౌదరి ఎన్టీఆర్ మంత్రి వర్గంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా కూడా పనిచేశారు. నాడు టీడీపీ ఆగస్టు సంక్షోభంలో ఎన్టీఆర్ వెంట నిలిచిన బుచ్చన్న తర్వాత పరిణామాల మేరకు చంద్రబాబు పక్షాన చేరారుఅయితే తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా గోరంట్ల బుచ్చయ్య చౌదరికి మంత్రి యోగం దక్కలేదు. ఆయనకు సామాజికవర్గమే కారణమయింది. ప్రాంతమే శాపంగా మారింది. తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యల్లో కాపులు, బీసీలకు మాత్రమే కేబినెట్ లో అవకాశం కల్పిస్తుండటంతో గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేరు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన నాలుగు సార్లు ఎప్పుడూ ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. అయినా బుచ్చయ్య చౌదరి ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ప్రతి సారీ బుచ్చన్నకు నిరాశే ఎదురవుతుంది. మొన్నటి ఎన్నికల్లోనూ రాజమండ్రి అర్బన్ నియోజకవర్గం ఆదిరెడ్డి కుటుంబానికి ముందుగానే ఫిక్స్ కావడంతో రూరల్ పై చివర వరకూ టెన్షన్ నడిచింది. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా కందుల దుర్గేష్ పోటీ చేస్తారన్న ప్రచారం జరిగింది. అయితే పవన్ కల్యాణ్ కు, దుర్గేష్ కు సర్ది చెప్పి ఆయనను నిడదవోలుకు షిఫ్ట్ చేయడంతో గోరంట్లకు చివరకు టిక్కెట్ దక్కింది. ఎమ్మెల్యేగా గెలిచినా కానీ ఆయన అనుకున్నది జరగలేదు. పార్టీని నమ్మకమైన నేతగా పేరున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరిని ఈసారి కూడా పక్కన పెట్టారు. అంటే ఆయన తనకు ఇదే చివరి ఎన్నిక అని పదే పదే ఎన్నికల ప్రచారంలో చెబుతూ వస్తున్నారు. అంటే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కల నెరవేరదా? అన్న అనుమానం ఆయన అనుచరుల్లో బయలుదేరింది. గోరంట్ల కూడా గత ఎన్నికల ప్రచారంలో ఇదే తన చివరి ఎన్నిక అని ఇక పోటీ చేయబోనని చెప్పడాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. ఆయనకు ఈ దఫా విస్తరణలోనైనా కేబినెట్ లో అవకాశం కల్పించాలని ఆయన అనుచరులు కోరుతున్నారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వకపోవడం మాట అటుంచి ఆయన పోటీ చేయడానికి ఇష్టపడటంలేదని చెబుతున్నారు.

# ఇంటింటికి తొలి అడుగు

విజయవాడ, సెప్టెంబరు 8

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడూ అంతే. ఒకరు ప్రారంభించిన కార్యక్రమాన్ని మరొకరు మొదలు పెడతారు. ఆ కార్యక్రమం సక్సెస్ అయిందా? లేదా అన్నది చూడరు. 2019 ఎన్నికల్ల వైసీపీ గెలిచిన తర్వాత అనేకసంక్షేమ పథకాలను అమలు చేసింది. దాదాపు రెండున్నర లక్షల కోట్ల రూపాయల డబ్బులను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో వైసీపీ ఒక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యేలను గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేసింది. గడప గడపకు ప్రభుత్వం అని పేరుపెట్టింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే డిజైన్ తో టీడీపీ కార్యక్రమాన్ని సిద్ధం చేసింది. ఇంటింటికి తొలి అడుగు విజయయాత్రగా నామకరణం చేసింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యేలకు చంద్రబాబు ఆదేశించారు. అంటే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికే చాలా వరకూ అమలు చేశామని, పింఛను నాలుగు వేల రూపాయలు ఇవ్వడంతో పాటు దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడం, తల్లికి వందనం పథకం కింద పదమూడు వేల రూపాయలను ఒక్కొక్కరికి ఇవ్వడంతో పాటు ఆగస్టు పదిహేనో తేదీ నుంచి మహిళల ఉచిత బస్సు అమలు చేస్తామని చెప్పడం వంటివి చేయాలని చంద్రబాబు ఎమ్మెల్యేలకు, ప్రజప్రతినిధులకు చెప్పారు. జులై ఒకటో తేదీ నుంచి అన్ని నియోజకవర్గాల నుంచి క్షేత్రస్థాయిలో నివేదికలను చంద్రబాబు తెప్పించుకుని ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తారట. ఉచిత ఇసుక, మద్యం వంటి విషయాల్లో కొందరు ఎమ్మెల్యేలు ఆరోపణలు ఎదుర్కొనడంతో వారిని కూడా జనం వద్దకు పంపాలన్నది చంద్రబాబు ప్రయత్నం. గత ఏడాది నుంచి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వారికి వివరించి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా నియోజకవర్గం పరంగా ఏమి మంచి జరిగిందో జనాలకు వివరించి వారిలో ఏదైనా అసంతృప్తి ఉంటే దానిని తొలగించే ప్రయత్నం చేయాలని చంద్రబాబు ఆలోచన. అయితే జనం నుంచి ఎలాంటి స్పందన వస్తుందన్నది ఎమ్మెల్యేలకు అంతుచిక్కడం లేదు.. చంద్రబాబు చేయించిన సర్వేల్లో ప్రభుత్వంపై సానుకూలత ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల్లో ఎక్కువగా అసంతృప్తి ఉందని తేలింది. అందులో కొత్తగా ఎన్నికైన దాదాపు ఎనభై మంది ఎమ్మెల్యేల్లో అధిక శాతం కూడా ఉండటంతో వారిని ప్రజలతో మమేకం చేయాలని చంద్రబాబు ఈ కార్యక్రమాన్నితలపెట్టినట్లు కనపడుతుంది. దీంతో పాటు క్యాడర్ ను కూడా కలుపుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనగలిగితే ఎమ్మెల్యేలకు, క్యాడర్ కు మధ్య ఉన్న గ్యాప్ కూడా తొలగిపోతుందని భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు హడావిడి కాకుండా నాలుగేళ్ల ముందు నుంచే చర్యలు తీసుకోవడంతో పాటు కార్యకర్తలను కూడా మోటివేట్ చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా కనిపిస్తుంది. మరి ఈ కార్యక్రమం ఏ మేరకు సక్సెస్ అవుతుందన్నది చూడాల్సి ఉంది.

## ఖమ్మం లో యాంటీ డ్రగ్స్ డే ర్యాలీ

ఖమ్మంయువతను కాపాడుకోవాలి అనుకుంటే డ్రగ్స్ ను తరిమి కొట్టాల్సిందే అని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వరల్డ్ యాంటీ డ్రగ్స్ డే పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని మమత రోడ్డులో గల టాటా సర్వీస్ సెంటర్ నుండి లకారం ట్యాంక్ బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.. ర్యాలీలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి సునీల్ దట్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అరికట్టాలి అంటే యువత ,విద్యార్థులు ప్రతీ ఒకరు బాధ్యత తీసుకోవాలి అని. ఈ డ్రగ్స్ వల్ల శరీరం మొత్తం నిర్వీర్యం అయ్యి సమాజంలో దుష్పరిణామాలకు అవకాశం ఉంది అని .అందువల్ల ఇది మన అందరి బాధ్యత అని. మీ చుట్టుపక్కల ,స్నేహితులకి ఇటువంటి డ్రగ్స్ సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి అని కోరారు ఈ ర్యాలీలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శ్రీజా, ంఅఖ రమణమూర్తి ఇతర అధికారులు,విద్యార్థులు పాల్గొన్నారు..అనంతరం ర్యాలీలో పాల్గొన్న పోలీస్ డిపార్ట్మెంట్, విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ పై ప్రతిజ్ఞ చేపించారు.

## కొత్తవలస కేజీబీవీ పాఠశాలలో అగ్ని ప్రమాదం

విజయనగరంవిజయనగరం జిల్లా కొత్తవలస మండలం తుమ్మికాపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఇంటర్ సెకండియర్ స్టోర్ రూమ్ లో ఈ ప్రమాదం సంభవించింది. ఎస్వో విజయకుమారి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో కొత్తవలస, ఎస్.కోట ఫైర్ సిబ్బంది మంటలపే ఆర్పి వేశారు. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదని కొత్తవలస స్టేషన్ ఫైర్ ఆఫీసర్ యస్వకుమార్ తెలిపారు. ప్రమాదంలో సుమారు 250 పరుపులు కాలిపోయినట్లు చెప్పారు.

## రేషన్ వద్దంటే నిత్యావసరాలు

ఏలూరు,సెప్టెంబరు 8 ( రేషన్ సరకులు పక్కదారి పట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రేషన్ షాపుల్లోనే నేరుగా రేషన్ ఇస్తోంది. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రేషన్ బియ్యం వద్దు అన్న వాళ్లకు నిత్యవసర సరకులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇలా చేయడం వల్ల బియ్యం పక్కదారి పట్టకుండా చూడొచ్చని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలం నుంచి రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయం తెలిసిందే. ఎన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నా చట్టాల్లోని లోపాలని వినియోగించుకొని కేటుగాళ్లు తప్పించుకుంటున్నారు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయడం వల్ల ఇలాంటి దందా విపరీతంగా పెరిగిపోయిందని ప్రభుత్వం షాపుల ద్వారా పంపిణీ చేపట్టింది. కానీ ఇలా పంపిణీ చేపట్టిన తొలి రోజే భారీ సంఖ్య రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు.రేషన్ బియ్యం మాఫీ వెనుకాల ఉన్న వారి ఎత్తులు ఒక రకంగా ఉంటే... రేషన్ బియ్యం అవసరం లేని వాళ్లు వాటిని అమ్ముతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ మధ్య వివిధ ప్రాంతాల్లో తిరిగి ప్రజలతో మాట్లాడిన శాసనసభా కమిటీ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యశ్రీ తోపాటు ఇతర ప్రభుత్వ పథకాల కోసం కొందరు రేషన్ కార్డు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి వారికి రేషన్ అవసరం లేదని అందుకే వారు ఆ రేషన్ తీసుకొని అమ్మేయడమో లేదా రేషన్ డీలర్‌కు వదిలేయడంతో వాళ్లు అమ్ముకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికెట్టేందుకు కేవలం ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యశ్రీ కోసమే రేషన్ కార్డు తీసుకుంటున్న వారికి వేరే కార్డు ఇస్తే సరిపోతుందన్నారు. ఆరోగ్య శ్రీకు వేరుగా కార్డు ఇస్తే వాళ్లకు రేషన్ కార్డు కట్ చేయవచ్చని తెలిపారు. ఫలితంగా రేషన్ పక్కదారి పట్టే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. వారి సూచనలు పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం నేరుగా రేషన్ కార్డు కట్ చేస్తే వ్యతిరేకత వస్తుందని ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తోంది. అలాంటి వారందరి నుంచి ముందే సమాచారం సేకరించి వారికి నిత్యవసర సరకులు ఇవ్వబోతున్నారు. బియ్యంం వద్దంటే వారికి కందిపప్పు, నూనెతోపాటు ఇతర సరకులు ఇస్తారు. దీని వల్ల ప్రభుత్వంపై భారం పడినప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని అంటున్నారు.

# 5 వేల ఎకరాల్లో..ఏపీలో కొత్త ఎయిర్‌పోర్టు.

విజయవాడ, సెప్టెంబరు 8

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. అమరావితి అంతర్జాతీయ స్థా?యి నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అమరావతిలో మౌలిక వసతుల ప్రాజెక్టులకు పెద్ద పీట వేస్తోంది. అమరావతిని ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అలాగే స్పోర్ట్స్ సిటీ, అమరావతిలోక్రికెట్ స్టేడియం వంటి నిర్మాణాలను చేపట్టనుంది. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. అమరావతి కోసం అదనంగా భూమిని సమీకరించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి అదనపు భూసమీకరణకు ఏపీ కేబినెట్ కూడా

గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.లో ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక విషయాలు వెల్లడించారు. అమరావతిలో అదనపు భూ సమీకరణకు జులై నెలాఖరులో సీఆర్డీఏ నోటిఫికేషన్ ఇస్తుందని మంత్రి నారాయణ వెల్లడించారు. అలాగే అదనపు భూ సమీకరణకు 2015 నాటి నిబంధనలే అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికి ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. అమరావతిలో 5000 ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించనున్నారు. అలాగే 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, మరో 2,500 ఎకరాల్లో స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం 10 వేల ఎకరాలు అవసరమవుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు.మరోవైపు అమరావతి భవిష్యత్తు అవసరాల కోసం అదనంగా 45 వేల ఎకరాలు సమీకరించనున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాల్సి ఉంటుందన్న ఆయన.. ఈ నేపథ్యంలో ఎక్కువ భూమి అవసరమవుతోందన్నారు. మరోవైపు అమరావతిలో అనేక సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయిస్తోంది.రాజధాని అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే క్రమంలో పలు కంపెనీలకు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అమరావతిలో భూములు కేటాయిస్తోంది. ఇప్పటి వరకూ సుమారుగా 74 సంస్థలకు అమరావతిలో భూములు కేటాయించారు. మూడేళ్లలోగా అమరావతి నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# కనిపించని కోనసీమ లీడర్లు...

కాకినాడ, సెప్టెంబరు 8

అమలాపురం ఎమ్మెల్యేగా గెలిచి వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన విశ్వరూప్..అప్పుడు కీలకంగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మాత్రం ఆయన పార్టీ యాక్టివిటీకి దూరంగా ఉంటున్నారట. ప్రజా సమస్యల మాట అటు ఉంచితే క్యాడర్ కష్టసుఖాలను కూడా పట్టించుకోవడం లేదట. ఇదే జిల్లా నుంచి అప్పట్లో వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా చేసిన అప్పటి ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రస్తుతం సైలెంట్‌గా ఉంటూ ఎక్కడా కనిపించడం లేదు. పార్టీ కార్యక్రమాలను కూడా గాలికి వదిలేయడంతో ముమ్మిడివరం నియోజకవర్గంలో వైసీపీ యాక్టివిటీ లేకుండా పోయిందటఇక వైసీపీ రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్న రామచంద్రపురానికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్.. గత ఎన్నికల్లో తన తనయుడు పిల్లి సూర్య ప్రకాశ్‌కు టికెట్ ఇప్పించుకుని గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. కానీ కూటమి గాలికి ఓటమి తప్పలేదు. ఎంపీ బోస్ మాత్రం రామచంద్రపురం నియోజవర్గంలో పార్టీ కార్యక్రమంలో నేనున్నానని చెప్పుకునే విధంగా తన కొడుకుతో పాటు కనిపిస్తున్నారు. కేవలం నియోజకవర్గానికి మాత్రమే పరిమితమయ్యారు. ఇక ఇదే జిల్లా నుంచి ఎమ్మెల్సీగా అవకాశం దక్కించుకున్న మరొక నేత తోట త్రిమూర్తులు. మండపేట నియోజవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన ఆయన ఏడాదిగా తన నియోజకవర్గం వరకు అరకొరగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారట. అయితే తోట త్రిమూర్తులు పెద్దగా యాక్టీవ్‌గా కనిపించడం లేదని క్యాడర్ అసంతృప్తిగా ఉన్నారట.గత ప్రభుత్వంలో ప్రభుత్వ విప్‌గా చేసి ఇప్పుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి. ఇటీవల కాలంలో జిల్లా అధ్యక్షుడిగా పదవి ఇచ్చినప్పటికీ అది హోదాగానే ఫీల్ అవుతున్నారట ఆయన. పార్టీ కార్యక్రమాలు కానీ..ప్రజా సమస్యలపై పోరులో దూకుడు చూపించడం లేదంటున్నారు క్యాడర్.ఇక పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గం వైసీపీ పరిస్థితి చెప్పనవసరమే లేదు. అసలు ఆ లీడర్లు ఎక్కడున్నారో కూడా ఎవరికీ తెలియదు. నేతలు ఎవరికి వారు బిజీ అయిపోవడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వైసీపీ క్యాడర్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందట. కార్యకర్తలకు భరోసా ఇచ్చే నేత లేకపోవడంతో కార్యకర్తలు అయోమయంలో ఉన్నారట. ఇప్పటికైనా అంబేద్కర్ కోనసీమ జిల్లాపై పార్టీ అధినేత జగన్ స్పెషల్ ఫోకస్ పెట్టాలని కోరుతున్నారట క్యాడర్. జిల్లాలో రాబోయే రోజుల్లో వైసీపీ యాక్టివిటీ స్పీడప్ అవుతుందో లేదో చూడాలి.

# పవన్ 2.0 ఎలా ఉంటుంది

నెల్లూరు,సెప్టెంబరు 8

ఆంధ్రప్రదేశ్‌లో పొలిటికల్ హీట్ మళ్లీ పొగలు సెగలుగక్కుతోందా అంటే?.. పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనకు తొలి అడుగు సభ జరిగింది. ఈ సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగం చుట్టూ ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. తేడా చేస్తే? తొక్కి నార తీస్తామన్న డిప్యూటీ సీఎం మాటల్ని గుర్తు చేస్తూ?. పవన్ మళ్ళీ అఫెన్సివ్ మోడ్‌లోకి వచ్చారా అంటూ చర్చించుకుంటున్నాయి రాజకీయవర్గాలు. వైసీపీ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారాయన. పోలీసులపై ఒత్తిడి తెస్తోందని, ఇలాంటి పరిస్థితిని సహించే ప్రసక్తే లేదని క్లారిటీగా చెప్పేశారు పవన్. గొంతులు కోస్తాం? అన్న బెదిరింపులు పిచ్చి ధోరణి అంటూ తీవ్రంగా స్పందించారాయన. అలాంటి అసాంఘిక వ్యాఖ్యలకు భయపడేది లేదని, శాంతిభద్రతల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిందేనని అధికారులను ఆదేశించారు. ఇప్పుడీ వ్యాఖ్యల్ని ప్రస్తావిస్తున్న విశ్లేషకులు..ఏడాది తర్వాత పవన్ తీరు మారిందని చెప్పుకొస్తున్నారు. గడిచిన ఏడాది కాలంగా?. పాలన మీద, షూటింగ్స్‌పై దృష్టి పెట్టిన డిప్యూటీ సీఎం? ఇకనుంచి రాజకీయంగా విపక్షం మీద విరుచుకుపడేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోందని అంటున్నారు. సుపరిపాలనలో ఈ దిశగా సంకేతాలిచ్చినట్టు అంచనా వేస్తున్నారు పరిశీలకులు. ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళడమేకాకుండా? వైసీపీ ఆరోపణలకు దీటైన కౌంటర్స్ ఇచ్చే దిశగా పవన్ వ్యూహం సిద్ధం చేసుకున్నట్టు కనిపిస్తోందని అంటున్నారు. సభలో ఉప ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గమనిస్తే? ఈ విషయం క్లియర్‌గా అర్ధమవుతోందని అంటున్నారు.పవన్ వ్యాఖ్యల ప్రకారం? గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు, అవినీతి వ్యవహారాలను విస్తృతంగా ప్రస్తావించి ఇప్పుడు ప్రజలకు వివరించాల్సిన సమయం వచ్చింది. ఇక సైలెంట్‌గా ఉంటే లాభం లేదని, వైసీపీ తిమ్మిని బమ్మిని చేసే ప్రయత్నంలో ఉందని భావిస్తున్నారట పవన్. విపక్షాల



దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, నిజాలను ప్రజల ముందుంచడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పవన్ అభిప్రాయపడుతున్నట్టు చెప్పుకుంటున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఓవైపు పరిపాలన విషయంలో వేగంగా ఆడుగులు వేస్తుంటే?.దానికి తోడుగా పవన్ కూడా రాజకీయంగా వ్యూహాత్మక దూకుడు పెంచాలని నిర్ణయించుకున్నట్లు అంచనా వేస్తున్నారు పొలిటికల్ పండిట్స్. ప్రజా వేదికలపై ప్రభుత్వ ప్రతినిధిగా మాట్లాడుతూ? ఆల్‌రౌండర్ పాత్ర పోషించేందుకు పవన్‌కళ్యాణ్ సిద్ధమైనట్టు చెప్పుకుంటున్నారు. ప్రజలకు మంచి చేయాలంటే? నిజాలను చెప్పాలి, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు బహిర్గతం చేయాలన్నది డిప్యూటీ సీఎం ప్లాన్ అట. వాస్తవాల మీద నిర్మితమైన పాలన జరిగితేనే ప్రజలకు నమ్మకం పెరుగుతుందని సభలో అన్నారు పవన్ కళ్యాణ్. ఈ మాటలు కేవలం ఆయన వైఖరిని తెలియజేయడమే కాకుండా, ప్రతిపక్షాలపై స్పందించే కొత్త దిశను సూచిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అటు వైసీపీ ప్రభుత్వ కాలంలో జరిగిన రకరకాల అవకతవకలపై దర్యాప్తు వేగం పెరుగుతోంది. వాటి సారాంశాన్ని రాజకీయ పరంగా ప్రజలలోకి తీసుకెళ్లే బాధ్యతను పవన్ స్వయంగా తీసుకుంటున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. ఇందులో భాగంగా? రాబోయే రోజుల్లో ప్రెస్‌మీట్లు, పబ్లిక్ మీటింగ్స్ పెట్టే అవకాశం ఉందని అంటున్నారు. ఈ దిశగా జనసేన కార్యకర్తలకు కూడా సందేశాలు వెళ్ళబోతున్నాయట. మొత్తంగా సుపరిపాలన సభలో? పవన్ తన కొత్త రోల్ గురించి క్లియర్‌గా చెప్పినట్టే కనిపిస్తోందని అంటున్నారు పొలిటికల్ పరిశీలకులు.

# ఇద్దరి కంటే తక్కువ పిల్లలు ఉంటే అనర్హత

## ఏపీలో జనాలు పెంచే కసరత్తు

తిరుపతి, సెప్టెంబరు 8


రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో జనాభా ఆశించిన స్థాయిలో పెరగడం లేదని.. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రమాదం తప్పదని ఆయన హెచ్చరిస్తున్నారు. తాజాగా తొలి వెలుగు సభలో సైతం దీనిపై గట్టిగానే హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ మాదిరిగా ఏపీలో సైతం జనాభా పెరగాల్సిందేనని తేల్చి చెప్పారు. దీనికోసం గట్టిగానే కృషి చేస్తామని అన్నారు. అందులో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లలు ఉంటేనే పోటీకి అర్హత విషయాన్ని ప్రస్తావించారు. జనాభా పెరుగుదలపై చంద్రబాబు మాట్లాడడం ఇదే తొలిసారి కాదు. ఇటీవల పలు వేదికలపై చంద్రబాబు ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీంతో చంద్రబాబు దూరదృష్టితో ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని అర్థమవుతోంది.గతంలో ఇద్దరు హద్దు.. ఒకరు ముద్దు అన్న నినాదంతో జనాభా నియంత్రణ సాగింది. ఇద్దరికంటే ఎక్కువగా పిల్లలు ఉంటే స్థానిక సంస్థల్లోపోటీకి అనర్హులని తేల్చారు కూడా. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. జనాభా ఎక్కువగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్న పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా జనాభా నియంత్రణ కావడంతో పిల్లలు యువత సంఖ్య తగ్గుముఖం పట్టింది. నడివయస్కులతో పాటు వృద్ధుల సంఖ్య పెరిగింది. దీంతో ఉద్యోగ ఉపాధి మార్గాలు తగ్గుముఖం పట్టాయి. వాటి ప్రభావం అభివృద్ధి పై పడింది. అందుకే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు పిల్లలను కనాలని పిలుపునివ్వడం కూడా ఆశ్చర్యం వేసింది. అయితే జనాభా పెరుగుదలతో అభివృద్ధి ముడిపడి ఉన్నందున సీఎం హోదాలో ఆయన ఈ వ్యాఖ్యలు తరచూ చేస్తున్నారు.ఉత్తరాది రాష్ట్రాలైన బీహార ఉత్తరప్రదేశ్లో జనాభా సంఖ్య అధిక సంఖ్యలో ఉంది. అక్కడ ఉద్యోగంతో పాటు ఉపాధి మార్గాలు కూడా పెరిగాయి. ప్రజల తలసరి ఆదాయం పెరిగింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రాజ్యాంగబద్ధ నిధులు కూడా అధికంగా ఆ రాష్ట్రాలకు వస్తున్నాయి. ఒక కుటుంబ ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని తలసరి ఆదాయాన్ని లెక్కిస్తారు. అయితే ఈ విషయంలో ఆ రెండు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. అందుకే చంద్రబాబు పదేపదే ఆ రెండు రాష్ట్రాల ప్రస్తావన తీసుకొస్తున్నారు. వీలైనంతమందిని ఎక్కువగా కనాలని సూచిస్తుండడం విశేషం.మరోవైపు జనాభా పెరుగుదల కోసం ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా పరిగణించేవారు. అయితే ఇప్పుడు జనాభా పెరుగుదలను ప్రోత్సహించేందుకుగాను ఏపీ ప్రభుత్వం ఆ నిబంధనను తొలగించింది. దీనికి సంబంధించిన చట్ట సవరణ బిల్లును కూడా ఏపీ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఈ నిబంధనను తీసుకొచ్చారు. అయితే సంతానోత్పత్తి రేటు తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరగడం వంటి కారణాలవల్ల ఏపీ ప్రభుత్వం ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. 2001లో ఏపీలో సంతాన ఉత్పత్తి సామర్థ్యం రేటు 2.6% గా ఉంది. ప్రస్తుతం అది 1.5 శాతానికి తగ్గిపోయింది. అందుకే చంద్రబాబు పదేపదే ఈ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఏపీలో జనాభా పెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు, ప్రోత్సాహకాలు పెడుతున్నారు.

# ఇక ఉమా వంతేనా...

విజయవాడ, సెప్టెంబరు 8

టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా పార్టీ మారతారన్న ప్రచారం ఇప్పుడు ఉమ్మడి కృష్ణా జిల్లాలో హాట్ హాట్‌గా నడుస్తోంది. పార్టీ మారతారన్నది ఒక ఎత్తయితే?. ఏకంగా వైసీపీలో చేరబోతున్నారంటూ సోషల్ మీడియాలో ఊదరగొట్టడం కలకలం రేపుతోంది. ఆ ప్రచారానికి ఉక్కిరి బిక్కిరయిన ఉమా? చివరికి స్పందించి ఖండించాల్సి వచ్చిందంటే? పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. టీడీపీకి అత్యంత లాయల్ అన్న పేరుంది దేవినేనికి. 2014-19 మధ్య చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారాయన. 2019 ఎన్నికల్లో తొలిసారి ఓటమి చవిచూసిన ఉమా 2024లో టీడీపీ టికెట్ కూడా తెచ్చుకోలేకపోయారు. 2019లో వైసీపీ తరఫున పోటీచేసి తనపై గెలిచిన వసంత కృష్ణ ప్రసాద్‌కే 24లో తెలుగుదేశం పార్టీ టికెట్ ఇవ్వడంతో దేవినేని ఉమా పరిస్థితి దారుణంగా మారిపోయిందని చెప్పుకుంటారు.ఎన్నికలకు ముందు కాస్త అసమ్మతి గళం వినిపించిన ఉమా? ఆ తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో బహిరంగంగా ఎక్కడా నోరు తెరిచే సాహసం చేయడం లేదు. ఎలాగూ అధికారంలో ఉన్నాం కాబట్టి ఏదోఒక నామినేటెడ్ పదవి దక్కుతుందని భావించారట ఆయన. కానీ? జిల్లాలో పలువురికి పదవులు దక్కుతున్నా? ఉమా ఊసే రావడం లేదు. ఒక దశలో ఎమ్మెల్సీ వస్తుందని గట్టిగా ప్రచారం జరిగినా? చివరికి అది కూడా దక్కలేదు. మరోవైపు మైలవరం టీడీపీ శాసనసభ్యుడిగా వసంత కృష్ణ ప్రసాద్ ఉన్నప్పటికీ?.ఉమా జోక్యం మాత్రం తగ్గడంలేదన్నది ఎమ్మెల్యే వర్గం మాట. నియోజక వర్గంలో అనేక విషయాల్లో ఉమా జోక్యం చేసుకోవడం ఎమ్మెల్యే వర్గాన్ని ఇరిటేట్ చేస్తోందట. ఇద్దరు నేతల మధ్య ఏ మాత్రం సఖ్యత లేదన్నది ఇక్కడ బహిరంగంగా చెప్పుకునే మాటే. ఈ పరిస్థితుల్లో ఉమా కూడా నియోజకవర్గంలో యాక్టివ్ అయ్యే ప్రయత్నాలు చేస్తున్నారట. గతంలో తనతో పాటు పనిచేసి ప్రస్తుతం వసంత దగ్గరకు వెళ్లిన వాళ్లు కాకుండా? మిగతా వాళ్ళతో కలిసి మైలవరం రాజకీయాలు చెక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. ఎమ్మెల్యే వసంత దగ్గరకు వెళ్లి కొన్ని కారణాలతో అసంతృప్తికి గురైన వారిని కూడా ఉమా దగ్గరకు తీసే ప్రయత్నాలు చేస్తున్నారనేది లోకల్ టాక్.

ఇవాళ కాకపోతే రేపైనా తనకు పార్టీలో గుర్తింపు దక్కుతుందని, పదవి వస్తుందన్న ఆశతో ఉమా పని చేస్తున్నారన్నది ఆయన అనుచరుల మాట.ఇలాంటి సమయంలో మాజీ మంత్రి టిడిపిని వీడి వైసీపీలో చేరతారన్న ప్రచారం మొదలవడంతో ఆయన వర్గానికి దిమ్మ తిరిగిపోయినట్టు సమాచారం.అటు ఉమా కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారట. అసలీ ప్రచారం ఎక్కడి నుంచి మొదలైందని ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నిర్ణయాలపై పెద్ద ఎత్తున విమర్శలు చేసి ఆందోళనలు నిర్వహించిన ఉమా? ఇప్పుడు ఆ పార్టీలోకి వెళ్తారన్న సోషల్ మీడియా ప్రచారం రాజకీయ వర్గాల్లో కూడా తీవ్ర చర్చనీయాంశం అయింది. పరిస్థితి చేయి దాటిపోతోందని



గ్రహించిన ఉమా వెంటనే స్పందించి వైసీపీ దిగజారుడు రాజకీయాలతో ఇలాంటి ఫేక్ ప్రచారాలు చేస్తోందంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

తన పార్టీ మార్పు ప్రచారం వెనక వైసీపీ ఉన్నట్టు ఎక్స్ మెసేజ్‌లో పెట్టినా?దీని వెనక సొంత పార్టీ వాళ్ళ ప్రమేయం కూడా ఉందని అనుమానిస్తున్నారట ఎక్స్ మినిస్టర్. ఆయన అనుమానం ప్రధానంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వర్గం మీద ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో అసత్య ప్రచారంపై విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లారు దేవినేని. అటు ఎమ్మెల్యే వసంత వర్గం మాత్రం? తమకు ఆ అవసరం లేదని, అటెన్షన్ కోసమే ఉమా అలా ఆరోపిస్తున్నారేమోనని కామెంట్ చేస్తోందట. ఈ వ్యవహారం ఎంతదాకా వెళ్తుందోనని గమనిస్తున్నాయి రాజకీయవర్గాలు.

## తెలంగాణలో డ్రగ్స్ ఉండరాదు నల్గొండలో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నాం: మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ సెప్టెంబరు 8

మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవంలో భాగంగా రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఎన్జీ కళాశాల వద్ద జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. తరువాత క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.తెలంగాణ కోసం 11 రోజులు ఇక్కడే నిరాహార దీక్ష చేశాను. కరోనా తర్వాత డ్రగ్స్ వాడకం మరింత పెరిగింది. స్టూడెంట్స్ బానిసలుగా మారుతున్నారు. తెలంగాణలో డ్రగ్స్ ఉండరాదు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ కట్టిస్తున్నాం.నల్గొండలో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నాం. త్వరలోనే సిఎం తో ప్రారంభిస్తాం. డ్రగ్స్ వాడే వారిని కొట్టండి..పోలీసులకు సమాచారం ఇవ్వండని అన్నారు.

విద్యార్థులకు ఇది లైఫ్ టర్నింగ్ టైం. 20 ఏండ్ల వరకు చదువు,స్పోర్ట్స్,యోగ పై దృష్టిపెట్టండి. హైదరాబాద్ లో డ్రగ్స్ పై కఠిన చర్యలు తీసుకొంటున్నాం.ఎక్కడికక్కడే కట్టడి చేస్తున్నాం. విద్యార్థులు,యువత సెల్ ఫోన్ కు వీలైనంత దూరంగా ఉండండి. అవసరమైతేనే వాడాలి. చదువుపైనే దృష్టి పెట్టండి. చదివి పోటీ పరీక్షలు రాస్తూ ఉద్యోగాలు పొందండి. ప్రకాశం బజార్ లో ప్రతీక్ ఫౌండేషన్ తో పాఠశాల నిర్మిస్తున్నాం. డిజిటల్ తరగతుల తో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. మీ భవిష్యత్ బాగుండాలంటే డ్రగ్స్ కు దూరంగా ఉండండి. విద్యార్థులకు ఎం కావాలన్న ప్రతీక ఫౌండేషన్ ద్వారా ,మంత్రిగా సహకారం అందిస్తా. డ్రగ్స్ వ్యతిరేకంగా చురుకుగా ఉండండని అన్నారు.జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, అడిషనల్ కలెక్టర్ జె .శ్రీనివాస్, అందరూ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడారు.

మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆదనపు ఎస్పీ రమేష్, డి డబ్ల్యుఓ కృష్ణవేణి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి.డీఈవో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

## రోబ్లెక్స్ గేమింగ్ పై చర్యలు తీసుకోవాలి జనసేన నేత కిరణ్ రాయల్

తిరుమల సెప్టెంబరు 8

తిరుమల యాత్రపై రోబ్లెక్స్ కంపెనీ గేమింగ్ యాప్ సృష్టించి భక్తులను మోసగిస్తుందని జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. భక్తుల సెంటిమెంట్ ను ఉపయోగించుకొని, సోషియల్ మీడియాలో నయా మోసాలు చేస్తోందని అన్నారు. సదరు కంపెనీపై అయన టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు కు పిర్యాదు చేసారు.తిరుమల మీద గేమ్ డిజిన్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ను కోరారు. దీనిపై స్పందించిని ఛైర్మన్ వెంటనే చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులను అదేశించారు.తిరుపతి నుండి తిరుమల ప్రయాణం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి శ్రీవారి ఆలయం, దైవదర్శనం చేసుకొనే దృశ్యాలతో రోబ్లెక్స్ కంపెనీ యాప్ రూపొందించింది.ఛైర్మన్ మాట్లాడుతూ దైవ భక్తిని .అదను గాచేసుకొని డాలర్స్ రూపంలో అన్ లైన్ లో వసూలు చేసినట్లు మాకు ఫిర్యాదు అందింది. స్వలాభం కోసం తిరుమల దృశ్యాలతో అక్రమాలను పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## నిరుద్యోగ భృతి సాధనకై ఉద్యమిద్దాం: ఏఐవైఎఫ్ నిరుద్యోగాంధ్రప్రదేశ్‌గా మారకముందే పాలకులారా మేల్కొండి. ఏఐవైఎఫ్ డిమాండ్

దేవనకొండ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్య వైఖరి కనబరుస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సి.రమేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి. రవికుమార్, ఎమ్. రామాంజనేయులు లు ఆరోపించారు. గురువారం దేవనకొండలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేసి అనంతరం నిరుద్యోగులను కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సి. రమేష్ మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నెలకి రూ. 3వేలు చొప్పన నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు నిరుద్యోగ యువతకి ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారం చేజిక్కించు కున్నారని తెలిపారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిరుద్యోగ భృతి ఊసే ఎత్తని పరిస్థితి వుందన్నారు. నిరుద్యోగ భృతి వస్తే పోటీ పరీక్షలకు శిక్షణ పొందు దామని నిరుద్యోగ భృతి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న నిరుద్యోగులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తంచేశారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 2025 ఫిబ్రవరి నెలలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ద్వారా నిర్వహించిన 'స్కిల్ సెన్సెక్స్ సర్వే' ప్రకారం 26 జిల్లాల్లో 2.67 కోట్ల మంది దగ్గర వివరాలను సేకరించగా ఉపాధి లేని వారి సంఖ్య కోటిన్నర పైనే ఉందన్నారు. రాష్ట్రంలో 18 నుండి 50సం॥ల మధ్య వయస్సు వారిలో ఏ ఉపాధి లేనివారు ఒక కోటి 56 లక్షల మందిఉన్నారని ప్రభుత్వగణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు.వీరిలో 52.69 లక్షల మంది ఏదో ఒక పని చేస్తున్నట్లు తెలపగా 52.74 లక్షల మంది ఏ పనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలపడం గమనార్హం.నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో నైపుణ్యం కలిగించేలా శిక్షణ ఇచ్చి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రకటనలే తప్ప సంవత్సర కాలంలో నిరుద్యోగ యువతకు ఒరిగిందేమి లేదు ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో సుమారు 3.20 లక్షల ఖాళీలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్న ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదలచేసే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు.

## పోలవరం ఎత్తు తగ్గించి రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీ గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాం: షర్మిలా రెడ్డి

నరసరావు పేటపల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం నాడు నరసరావుపేటలో జరిగింది. ముఖ్య అతిథిగా పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి పాల్గొన్నారు.

షర్మిలా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుంది. విస్తృత స్థాయి సమావేశాల్లో అన్ని సూచనలు పరిగణలోకి తీసుకుంటున్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడటం రాజకీయంగా చాలా అవసరం. కాంగ్రెస్ అధికారంలో వస్తేనే విభజన హామీలు సాధ్యం అవుతాయి. బీజేపీ గడిచిన 10 ఏళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత. కానీ బీజేపీ రాజధానికి అప్పులు ఇస్తుంది. పోలవరం ఎత్తు తగ్గించి రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేసింది. బీజేపీకి రాష్ట్ర ప్రయోజనాలను టీడీపీ, వైసీపీ,జనసేన పార్టీలు తాకట్టు పెట్టాయని అన్నారు.

రాష్ట్రంలో స్వార్థ రాజకీయాలు నడుస్తున్నాయి. బీజేపీ కి రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారు. బీజేపీని వ్యతిరేకించేది ఒక్క కాంగ్రెస్ మాత్రమే. అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడుతుంది. బీజేపీని ఎదిరించే సత్తా ఉన్నది కాంగ్రెస్ కి మాత్రమే. రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి అన్ని వ్యూహాలు రచిస్తున్నాం. గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టామని అన్నారు.

## చేర్యాల మద్దూర్ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

చేర్యాల సెప్టెంబరు 8

పోలీస్ స్టేషన్ ల చుట్టూ పరిసర ప్రాంతాలను మరియు సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డ్, రైటర్ రూమ్ పరిశీలించారు. మరియు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.పోలీస్ స్టేషన్ లో వివిధ కేసులలో ఉన్న వాహనాల యొక్క అడ్రస్ తెలుసుకుని సంబంధిత యజమానులకు త్వరగా అప్పగించాలని సంబంధిత ఎస్ఐ లకు సూచించారు.బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.త్వరలో జరుగు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు

ప్రజల రక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలి

ఇసుక,జూదం, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేయాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు మరియు పోలీస్ స్టేషన్ రికార్డ్స్, సిడి ఫైల్స్, తనిఖీ చేశారు ప్రతి రికార్డ్ అప్డేట్ ఉండాలని అధికారులకు సిబ్బందికి సూచించారు.

పోలీస్ సిబ్బంది యొక్క సమస్యలు అడిగి తెలుసుకుని ఏవైనా సమస్యలు ఉంటేనే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారుపోలీస్ అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నీతి నిజాయితీగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.విపిఒ, విలేజ్ పోలీస్ ఆఫీసర్ కేటాయించిన గ్రామాలకు కేటాయించిన వార్డులకు తరచుగా సందర్శిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని సూచించారు.విజబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలని ఉదయం సాయంత్రం విసేబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు

# ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా డాక్టర్లను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే నాగరాజు..




ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)సెప్టెంబర్8:ఫిజియోథెరపీ అనేది ఆరోగ్యరంగంలో అత్యంత కీలకమైన విభాగం..ఫిజియోథెరపీ వైద్యులు సేవా దృక్పథంతో పనిచేస్తూ సమాజ ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు.ఫిజియోథెరపిస్ట్ తొలి సంస్థాపన వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు.ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా హన్మకొండ సుబేదారి లోని ఎస్సార్ కన్వెన్షన్ హాల్ నందు లయన్స్ క్లబ్ హన్మకొండ ఫిజియోథెరపిస్ట్ తొలి సంస్థాపన వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు ఫిజియోథెరపీ వైద్యులను, విద్యార్థి, విద్యార్థినీలను ఘనంగా సన్మానించి మెడల్స్ ప్రధానం చేశారు.అనంతరం ఫిజియోథెరఫీ వైద్యులు బృందం ఎమ్మెల్యే నాగరాజు ని శాలువాతో ఘనంగా సత్కరించి ఫీల్డ్ ప్రధానం చేశారు....ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు ఫిజియోథెరపీ డాక్టర్లను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ..ఫిజియోథెరపీ అనేది ఆరోగ్యరంగంలో అత్యంత కీలకమైన విభాగం. రోగుల ఆరోగ్య పునరుద్ధరణలో, శరీర నొప్పులు, గాయాలు, స్ట్రోక్‌లు, శస్త్రచికిత్సల అనంతర పునరావాసంలో మీరు చేస్తున్న సేవలు అమూల్యం. మీ కృషి వల్ల అనేకమంది తిరిగి సాధారణ జీవితాన్ని గడపగలుగుతున్నారు. వైద్యరంగంలో మీ పాత్రకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది.మీరు సేవా దృక్పథంతో పనిచేస్తూ సమాజ ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. మీలాంటి ఫిజియోథెరపిస్టులు ఎక్కువగా ముందుకు వస్తే రోగులు ఔషధాలపై ఆధారపడకుండా సహజ పద్ధతుల్లోనే ఆరోగ్యాన్ని తిరిగి పొందగలుగుతారు.ప్రభుత్వం తరఫున మీ వృత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించడానికి కృషి చేస్తాం. మీ అందరి కృషి వలన ప్రజల్లో ఆరోగ్యజాగృతి పెరుగుతుందని నమ్ముతున్నాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ, ఫిజియోథెరపీ డాక్టర్ల కమిటీ, లయన్స్ క్లబ్ కమిటి సభ్యులు,ఫిజియోథెరపీ ట్రైనింగ్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోట్లు వృధా.. లక్ష్యానికి చెద.!

## -శిథిలమైపోతున్నా పట్టని వైనం

## -పూర్తి చేసి వెజ్-నాన్ వెజ్ మార్కెట్ ను ప్రజలకు అందుబాటులోకి తేవాలి.



మణుగూరు, సెప్టెంబర్ 08 (భారతశక్తి): అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వలన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ప్రజల పాలిట శాపంగా మారింది. మణుగూరు పట్టణంలోని రాజీవ్ గాంధీ నగర్ లో ఇంటిగ్రేటెడ్ వెజ్- నాన్ వెజ్ మోడల్ మార్కెట్ కోసం బిఆర్ఎస్ పార్టీ నాటి ఎమ్మెల్యే రేగా కాంతారావు 2021లో అట్టహాసంగా దీనికి శంకుస్థాపన చేశారు. దీనికి రూ.4.50 లక్షల అంచనతో నిర్మాణ పనులు కూడా చకచకా ప్రారంభించారు. 60శాతం పనులు కూడా పూర్తయ్యాయి. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వాలు మారడంతో నిర్మాణ పనులు హఠాత్తుగా ఆగిపోయాయి. అప్పటినుండీ.. కనీసం ఈభవన నిర్మాణం కోసం అడిగిన నాధుడే లేరు. పత్రికలలో ఎన్ని కధనాలు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే కు గాని, అధికారులకు చలనం లేక పోవడంతో స్థానిక ప్రజానీకం విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో..ఈ అసంపూర్తి నిర్మాణ ప్రాంతం ఇప్పుడు అరణ్యాన్ని తలపిస్తోంది. ప్రస్తుత ప్రజా ప్రతినిధి నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా.. నిర్మాణపు మొండి గోడలు వెక్కిరిస్తున్నాయి.

శిథిలమైపోతున్నా పట్టని వైనం

2021లో శంఖుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వెజ్- నాన్ వెజ్ మోడల్ భవనం శిథిలావస్థకు చేరింది. చిన్న పాటి వర్షానికే భవనం లోపల, గోడల గుండా వర్షపు నీరు కారుతుంది. కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారి మద్యం బాటిళు దర్శనమిస్తున్నాయి. కాంట్రాక్టర్ కాసుల కక్కుర్తి తో నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తూ ఇష్టారాజ్యంగా అసంపూర్తిగా నిర్మాణం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దింతో కాలక్రమంలో నిర్మాణంలో ఉన్న ఆ భవనం శిథిలావస్థకు చేరింది. గోడలే మిగిలి, కిటికీలు పగిలి, తలుపులు లేకుండా.. ప్రస్తుతం భూత్ బంగ్లా లా తయారైంది. ప్రాంగణం అంతా.. అరణ్యాన్ని తలపిస్తోంది. దీని దుస్థితి చూసిన స్థానిక ప్రజల్లో తీవ్రవిమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కోట్ల రూపాయల ప్రజా ధనంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నాశనం కాకుండా పరిరక్షించాలిని గిరిజన, కుల, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలందరూ అభిప్రాయ పడుతున్నారు. ఎంతో కాలం నుండి ఎదురు చూస్తున్న వెజ్-నాన్ వెజ్ వ్యాపారులకు అందించే విధంగా వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులను నివేదిక కొరతా.. ఎమ్మెల్యే పాయం

ఇటీవల నియోజకవర్గంలో రూ. 125 కోట్లు విడుదలైన విషయం గురించి (ప్రజాభవన్) ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ శిథిలావస్థకు చేరిందని, దానికి నిధులు వెచ్చించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని విలేకరులు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయం నా దృష్టికి రాలేదు. ఎంత వరకు పనుల పురోగతి జరిగిందో సంబంధించిన అధికారులకు తెలిపి నివేదిక తెప్పించుకుంటా.. దానిని బట్టి ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు వెచ్చించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తా..

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య..

సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 8:

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 61 ఫిర్యాదులు అందాయి.



జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కి పింఛన్లు, సంక్షేమ పథకాలు, భూ వివాదాలు, ఆరోగ్యం, విద్య, తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ప్రజలు తమ సమస్యలకు అధికారులనుండి స్పందన లభించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాగాలతో ప్రయోగాలు చేసి చెరగని ముద్ర వేసిన సుస్వరాల చక్రవర్తి


హైదరాబాద్, ( భారత శక్తి )సెప్టెంబర్ 8 :

ఆయన పాటకుబాణీ కట్టాడు అంటే అది హిట్టే..!

ఆయన నోటిమీదస్వరాలు నాట్యం చేస్తాయి...

పాటలు పరుగులు తీస్తాయి...స్వరాలను కూర్చడంలోఆయన ఓ చక్రవర్తి!

ఆయనే మన సంగీత దర్శకుడు చక్రవర్తి!



సుమారు 15 ఏళ్ల పాటు తెలుగు పాటకు కేరాఫ్ అడ్రస్ గా మారిన ఆయన ఎంత మెలోడియస్ గా పాటలను తీర్చేదిద్దగలరో... అంతే రిథమెటిగ్గా కూర్చనూ గలరు. కేవలం ఆయన సంగీతంతోనే హిట్ అయిన చిత్రాలు అనేకంగా ఉన్నాయి. 1970 చివర్లో వచ్చిన సూపర్ డూపర్ హిట్లన్నీ ఆయన సంగీతాన్ని అందించినవే కావడం ఆయనకు స్వరాల మీదున్న పట్టుకు నిలువెత్తు నిదర్శనం!



గాన గంధర్వుడు ఘంటసాల మాస్టారు స్ఫూర్తితో...

చక్రవర్తి అసలు పేరు కొమ్మినేని అప్పారావు. ఆయన తండ్రి బసవయ్య తల్లి అన్నపూర్ణమ్మ. వారిద్దరికీ ఆయన రెండవ సంతానంగా 1936 సెప్టెంబర్ 8న గుంటూరుకు సమీపంలోని పొన్నెకల్లు గ్రామంలో జన్మించాడు. స్వగ్రామంలో పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న చక్రవర్తి తాడికొండలోనూ, గుంటూరులోనూ మిగతా విద్యనంతా అభ్యసించారు. బి.ఎ. ఎకనామిక్స్ లో పట్టాపుచ్చుకోవడమే కాదు. హిందీ విశారద, టైప్ రేటింగ్ లో హైయర్ పాసయ్యారు. చిన్నప్పుడు సంగీతం మీద అభిమానంతో కూని రాగాలు తీస్తుండేవారు. అసలు సంగీతం పట్ల శ్రద్ధాసక్తులు పెరగడానికి గాన గంధర్వుడు ఘంటసాల మాస్టారే కారణం. ఆయన పాడిన 'కుంతీ కుమారి పద్యాలను' కంఠతా పట్టేసి రాగయుక్తంగా పాడేవారు. లలిత సంగీతానికి అర్థం చెప్పిన ఘంటసాల మాస్టారు గీతాలను సమయం దొరికినప్పుడల్లా పాడుకునేవారు. ఆయన ఆసక్తిని చూసి ఆయన తండ్రి మహావాది వెంకటప్పయ్య దగ్గర సంగీతంలో శిక్షణ ఇప్పించారు. అయినా శాస్త్రీయ సంగీతం పెద్దగా వంట పట్టలేదు. ఓ పక్క చదువు. మరోపక్క సంగీతం. జోడు గుర్రాల మీద స్వారీ చేయలేకపోయారు. సంగీతాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గుంటూరులో వినోద్ ఆర్కెస్ట్రా స్థాపించారు. వందల కొద్ది కచేరీలు చేశారు. సంగీత విభావరిలో సినిమా పాటలు అస్సలు పాడేవారు కాదు. అవి భక్తి గీతాలు అయితే తప్ప. అన్ని లలిత గీతాలే. అన్నీ తానే స్వయంగా వరుసలు కట్టి పాడేవారు.

అప్పారావు కాస్త చక్రవర్తిగా...

అదే సమయంలో హెచ్‌ఎంవి వారికి పాటలు పాడుతుంటే, చక్రవర్తి పాటలు విన్న సంగీత దర్శక సోదరులు రాజన్, నాగేంద్ర ఆయనకు ఓ పాటకు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత విఠలాచార్య తన జయ విజయ సినిమాలో ఆయనకు ఓ పాట పాడే అవకాశం కల్పించారు. పాటైతే పాడారు కానీ వెంటనే అవకాశాలేవి వెతుక్కుంటూ రాలేదు. ఇక లాభం లేదని పొట్టకూటి కోసం పరిశ్రమకు చెందిన వివిధ శాఖల్లో పని చేశారు. డబ్బింగు మొదలైనవి చెప్పారు. నెల్లూరు కాంతారావు తీసిన డబ్బింగ్ సినిమా సర్వర్ సుందరంలో తమిళ నటుడు నగేష్ కు గాత్ర దానం చేసింది చక్రవర్తే. అంతకు ముందు సినిమాకు దర్శకత్వం వహించాలనుకున్న ఆయన. అనంతరం తన అర్ధాంగి కోరిక మేరకు మూగ ప్రేమ చిత్రంతో మ్యూజిక్ డైరెక్టర్ అయ్యారు. అప్పటి నుంచి ఆయన పేరు అప్పారావు కాస్త చక్రవర్తిగా మారింది. 1968లో భలే గుడాచారి సినిమాకు సంగీత దర్శకత్వం వహించారు. ఎం.ఎస్. రెడ్డి డబ్బింగ్ సినిమా కన్నెపిల్లకి కూడా చక్రవర్తి సంగీతాన్ని అందించారు. మూగ ప్రేమ తర్వాత చక్రవర్తికి ఇక వెనక్కి తిరిగి చూసుకోకుండా మంచి అవకాశాలు వచ్చాయి. శారద సినిమాతో విఖ్యాతి గడించారు. ఇక పూర్తిగా బిజీ అయిపోయారు.

చక్రవర్తికి బాణీలు కట్టడం హార్మోనియం మీద వేళ్ళు ఆడించినంత సులువు. పాటకు పట్టుమని పది నిమిషాలు కూడా తీసుకునేవారు కాదు. అందుకే వేలపాటలకు అవలీలగా ట్యూన్లు కట్టారు. అవి కూడా పది కాలాలపాటు నిలిచిపోయే విధంగా ఉండడం ఆయన ప్రతిభకు నిదర్శనం.

సంగీత దర్శకుడిగా.. నటుడిగా..

ప్రేమాభిషేకం సినిమాలోని తారలు దిగివచ్చిన వేళ, వందనం అభివందనం, కోటప్పకొండకు వస్తానని మొక్కుకున్నా, నా కళ్ళు చెబుతున్నాయి పాటలను కేవలం ఒకే ఒక్క రాత్రిలో కంపోజ్ చేశారు. ఇలాంటి ఫీట్లు చేయడం కేవలం చక్రవర్తికి మాత్రమే సాధ్యం. శాస్త్రీయ సంగీతంలో కాకలు తీరకపోయినా రాగాలతో ఆయన చేసిన ప్రయోగాలు అనన్య సామాన్యాలు. అనితర సాధ్యాలు. మ్యూజిక్ డైరెక్టర్గా బిజీగా ఉన్న సమయంలోనూ చక్రవర్తి చాలామంది నటులకు స్వరాన్ని అరువిచ్చేవారు. ఊర్వశిలో సంజీవ్ కుమార్ కు, కల్పనలో వరప్రసాద్ కు, మన్మథ లీల, ప్రేమ పూజారులలో కమల్ హాసన్ కు, ప్రేమ లేఖలు లో అనంతనాగ్ కు, ఆమె కథ లో రజనీకాంత్ కు, సీతా కళ్యాణం లో రాముడి పాత్ర వేసిన రవికి, మనీలో పరేష్ రాహుల్ కు చక్రవర్తి డబ్బింగ్ చెప్పారు. అంతేకాదు తన నటనా పటిమతో ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకోగలిగారు. గోపాలరావు గారి అమ్మాయిలో చెవిటి లాయర్ గా, పక్కింటి అమ్మాయిలో సంగీత మాస్టారుగా, ఆమె కథలో బీమా ఏజెంట్ గా, అల్లరి బుల్లోడులో రేషన్ ఆఫీసర్ గా, సీతాపతి సంసారంలో తిండిపోతు ఆఫీసర్ గా, అతని కంటే ఘనుడులో మోటారు షాపు యజమానిగా, గజదొంగలో కానిస్టేబుల్ గా చక్రవర్తి ఎంతో అద్భుతంగా నటించారు. సంగీత దర్శకుడిగా, నటుడిగా తన ప్రతిభాపాటవాలను అద్భుతంగా ప్రదర్శించిన చక్రవర్తి నిజంగా కళామతల్లి ముద్దుబిడ్డ.

అప్రతిహతంగా సాగిన జైత్రయాత్ర

సాధారణంగా ఒకే వృత్తిలో ఉన్న వారి మధ్య సహజంగానే వృత్తిపరమైన ఈర్ష అసూయలు ఉంటాయి కానీ చక్రవర్తి మాత్రం ఎందుకు పూర్తి భిన్నం సీనియర్ల దగ్గర వినయ విధేయతలతో మెలిగే వారు తన సహచర సంగీత దర్శకులతో మనసు విప్పి మాట్లాడేవారు ఓ మండువేసరి కాలం పవర్ కట్ కావడంతో విజయ డీలక్స్ థియేటర్ నుంచి బయటకు వచ్చారు చక్రవర్తి పక్కనే సత్యం ఉన్నారు ఇద్దరూ కలిసి సిగరెట్ ముట్టించుకున్నారు కాసేపయ్యాక సత్యాన్ని చూస్తే ఓ పక్క ఆనందం మరోపక్క అసూయ కలుగుతున్నాయి అన్నారు ఎందుకంటే నేనే పొట్టి నాకంటే ఇంకా పొట్టి సత్యం అందుకు ఆనందం ఇక అసూయ ఎందుకంటే సత్యం బాణీలు నాకంటే అంత చక్కగా అంత గొప్పగా ఎలా ట్యూన్లను కట్టగలుగుతున్నాడా అన్న అసూయ అన్నారు చక్రవర్తి ఓసారి సంగీత శాఖకు చెందిన కొంతమంది పిక్నిక్ వెళ్లారు ఆటలు పాటలు అందరిలోనూ అలుపెరుగని ఉత్సాహం చక్రవర్తి ఏమో షటిల్ అడి అలిసిపోయారు ఓ పక్కకు వెళ్లి హాయిగా నిద్రపోయారు భోజన వేళైంది అందరూ కాస్త ఎంగిలి పడ్డారు కానీ చక్రవర్తి మాత్రం కనపడలేదు కేవీ మహాదేవన్ మాత్రం వెతుక్కుంటూ వెళ్లారు బాలు ఎదురుపడితే చక్రవర్తి ఎక్కడరా కనిపించడం లేదు పాపం తిన్నాడో లేడు అనుకుంటూ చక్రవర్తిని వెతికి పట్టుకొని నిద్ర లేపి మజ్జిగ అన్నం తినిపించి మళ్లీ పడుకోబెట్టారు బాలు అలా ఉండేవి ఆనాటి సంగీత దర్శకుల మధ్యన అనుబంధాలు ఆప్యాయతలు చక్రవర్తి సంగీతం చందోరాహిత్యంలో చందస్సును సృష్టించుకున్న సహజ సాహిత్యం వంటిది 1980 మధ్య వరకు అప్రతిహతంగా సాగిన చక్రవర్తి జైత్రయాత్రకు ఒకరకంగా ఇళయరాజా అడ్డుకట్ట వేశారని చెప్పక తప్పదు 1000 సినిమాలైనా పూర్తి చేయాలన్నది చక్రవర్తి కోరిక కానీ ఆ కోరిక తీరకుండానే 2002 ఫిబ్రవరి మూడవ తేదీన చక్రవర్తి దివంగతులయ్యారు ఆయన మరణించిన ఆయన స్వరపరిచిన పాటలు ఇంకా అమృతాన్ని కురిపిస్తూనే ఉన్నాయి సుస్వర చక్రవర్తిగా ప్రేక్షకుల మదిలో చిరస్మరణీయమైన తమ ముద్రను వేశారు చక్రవర్తి ఆయనకు అక్షర నివాళి.

సాహిత్య కళా విభూషణ
మహాకవి
చౌదూరి నరసింహారావు

# గులాబీ బాటలో జగన్ అన్న

విజయవాడ, సెప్టెంబరు 8

జగన్మోహన్ రెడ్డికెసిఆర్ ను ఫాలో అవుతున్నారా? ఆయన సలహాలతోనే రాజకీయం చేస్తున్నారా? ఆయన మాదిరిగానే ఇంట్లో ఉండి క్యాడర్ తో ఆందోళనలు చేయిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కూటమి ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమానికి జగన్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ ఆయన మాత్రం ఎంచక్కా బెంగళూరు ప్యాలెస్ కు వెళ్లిపోయారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం కేసీఆర్ ఇదే ఫార్ములాను అనుసరించారు. క్యాడర్ను, తెలంగాణ ప్రజలను ఉద్యమంలోకి దించి తాను మాత్రం ఫామ్ హౌస్ లో ఉండి పోయేవారు. ఇప్పుడు జగన్ పరిస్థితి అలానే ఉంది. అధికారపక్షంపై పోరాటం చేయాలని క్యాడర్ ను పురమాయించి.. ఆయన మాత్రం బెంగళూరు వెళ్ళిపోయారు. వెన్నుపోటు హైలెట్స్ తో సాయంత్రం తీరిగ్గా ఓ వీడియో కూడా రిలీజ్ చేశారు. వెన్నుపోటు గ్రాండ్ సక్సెస్ అంటూ ట్వీట్ చేశారు. అయితే ఇది అచ్చం కెసిఆర్ స్ట్రాటజీ మాదిరిగా ఉందని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్..

కామారెడ్డి జిల్లా,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 08: ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.



సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 73 అర్జీలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులనుండి వివిధ సమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ తో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రామకృష్ణ మట్, ఇన్ఫోసిస్ సహకారంతో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించిన రిలీఫ్ కిట్..


కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 08: కామారెడ్డి పట్టణంలోని వరద బాధిత కుటుంబాలకు సోమవారం కామారెడ్డి పట్టణంలోని ఇఎస్ఆర్ గార్డెన్స్ లో రామకృష్ణ మట్, ఇన్ఫోసిస్ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ చేతుల మీదుగా రిలీఫ్ కిట్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మునుపెన్నడు లేని విధంగా జిల్లాలో కురిసిన అధిక వర్షాల కారణంగా



వరదలు సంభవించి తీవ్ర నష్టం కలిగించిందని అన్నారు. వరద బాధితుల కుటుంబాలను ఆదుకునేందుకు రామకృష్ణ మట్ ముందుకు వచ్చి ఇప్పటికే వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించడం జరిగిందని తెలిపారు. సోమవారం కామారెడ్డి పట్టణంలో ఇన్ఫోసిస్, రామకృష్ణ మట్ వారి సహకారంతో ముంపు బాధిత కుటుంబాలకు 334 రిలీఫ్ కిట్స్ ను అందించడం జరిగిందని తెలిపారు. రిలీఫ్ కిట్లో బియ్యం, పప్పు, నూనె, సబ్బులు, పప్పులు, ఉప్పు, పసుపు తదితర నిత్యావసర సరుకులు, బ్లాంకెట్లు, దుప్పట్లు ఈ రిలీఫ్ కిట్ లో ఉన్నాయి. అదేవిధంగా ఈ నెల 9వ తేదీ మంగళవారం నాడు ఎల్లారెడ్డిలో వరద బాధిత కుటుంబాలకు 150 కిట్లను, బాన్సువాడలో 150 కిట్లను ఇన్ఫోసిస్, రామకృష్ణ మట్ సహకారంతో అందించడం జరుగుతుందని అన్నారు. ఆపద సమయంలో ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకుంటున్నందుకు రామకృష్ణ మట్, ఇన్ఫోసిస్ సంస్థకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞత తెలుపుతున్నట్టు తెలిపారు. సోమవారం, మంగళవారం, అందజేసే మొత్తం కిట్ల విలువ 20 లక్షల రూపాయలు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి వరద భాదితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డిఓ వీణ, తహసీల్దార్ జనార్దన్, రామకృష్ణ మట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


## ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి- కలెక్టర్ జితేష్ వి పాటిల్..

మణుగూరు,సెప్టెంబర్ 08 (భారతశక్తి): ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చు కోవాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం మణుగూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఏటీసీ భవన సముదాయాన్ని పరిశీలించారు.



ఐటిఐ లను మరింత ఆధునికరించే భాగంలోనే ఏటీసీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐటిఐ ఏటీసీలలో శిక్షణ పొందిన విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఏటిసి పూర్తిచేసిన ప్రతి విద్యార్థికి వివిధ పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు శిక్షణ కాలంలో మంచిగా చదువుకొని సంపూర్ణ శిక్షణ పొందాలన్నారు. ఐటిఐలో చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను ఉచితంగా అందజేస్తామన్నారు. విద్యార్థులు శిక్షణ నైపుణ్యం పెంపొందించు కోవాలన్నారు. అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన ఏటీసీలో సరియైన శిక్షణ పొందాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఐటిఐ సూపరిండెంట్ జ్యోతి రాణి, ఏటీఓ లు జి వి కృష్ణారావు, వేణుగోపాల్, ఏటీసీ సిబ్బంది పాల్గొన్నారు.


## రాజన్న ఆలయంలో ఈవో రమాదేవి తనిఖీ..



వేములవాడ, సెప్టెంబర్ 08 (భారత శక్తి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఈవో సోమవారం ఎల్. రమాదేవి భీమేశ్వర సదన్ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు అందించాలని ఆలయ సిబ్బందికి సూచించారు. అలాగే, భీమేశ్వర ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఈవో, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల ప్రారంభమైన రూ.200 కోడె ఈ-టికెట్ సేవను ప్రారంభించారు. ఆమె, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ని ఆలయ ఈవో రమాదేవి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఎస్పీకి స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులపై చర్చించి, ఇరు విభాగాల సమన్వయంతో దేవస్థానాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే అంశంపై చర్చించినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఆమె వెంట ఆలయ ఈఈ రాజేష్, డి.ఈ. రఘునందన్, పర్యవేక్షకులు శ్రీకాంత్ చార్యులు, పూర్ణం వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ప్రభుత్వంలో యూరియా కొరితే లేదు చల్మెడ.

వేములవాడ, సెప్టెంబర్ 08 (భారత శక్తి) : వినాయక చవితి పండుగ రోజు కూడా రైతులు వర్షంలో తడుస్తూ ఎరువుల కోసం పడిగాపులు కాయాల్సి రావడం దురదృష్టకరమని, ఇలాంటి దుస్థితి ఎందుకు దాపురించిందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ ఒక్క రోజూ ఎరువుల కొరత రాలేదని, రైతులు లైన్లలో నిల్చున్న సందర్భమే లేదని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు వైఫల్యం వల్లే ప్రభుత్వ విప్ ఆయన సొంత గ్రామం రుద్రంగి నుండే యూరియా కొరత ప్రారంభమై, ఇప్పటికీ కొనసాగుతుందని పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లాలోనే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అత్యధిక యూరియా కొరత ఉన్నదని, ఇంకా 6 వేల మెట్రిక్ టన్నుల సరఫరా జరగాల్సి ఉందని తెలిపారు. యూరియా కోసం రైతులు అడిగితే కేసులు పెడుతున్న కాంగ్రెస్ పాలన రైతు వ్యతిరేక వైఖరిని బయటపెడుతోందని విమర్శించారు. వేములవాడ కోఆపరేటివ్ సొసైటీ వద్ద రైతులకు అండగా నిలిచిన ఎనిమిది మంది బీఆర్ఎస్



నాయకులపై కేసులు పెట్టడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. కేసులు పెట్టడం కాకుండా రైతుల సమస్యల పరిష్కారం చేయాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ దేనని స్పష్టం చేశారు. అలాగే దేవాలయ అభివృద్ధి పనులపై మాట్లాడుతూ, సమ్మక్క- సారక్క జాతర, దసరా, శివరాత్రి వంటి ముఖ్య పండగల సందర్భాల్లో తొందరపడి పనులు ప్రారంభించడం వ్యాపారస్తులకు ఇబ్బందిగా మారుతుందని, కనీసం ఫిబ్రవరి తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి దశల వారీగా ఎలా జరుగుతుందో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పై ఉందన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యేకు ప్రాజెక్టుపై అవగాహన లేదని, బిఆర్ఎస్ ప్రభుత్వమే మిడ్ మానేర్, మల్కపేట, అన్నపూర్ణ రిజర్వాయర్లు పూర్తి చేసి రైతులకు నీరు అందించిందని గుర్తు చేశారు.

యూరియా కోసం చెప్పులు, ఆధార్ కార్డులను లైన్లలో పెట్టాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు. అలాగే రైతులకు అండగా నిలబడితే బిఆర్ఎస్ నాయకుల పై అక్రమ కేసులు పెట్టడంపై తీవ్రంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు.

యూరియా కొరతపై కాంగ్రెస్ పై విరుచుకుపడ్డ చల్మెడ,

వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు సోమవారం ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ యూరియా కొరత రాలేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 21 నెలలకే రైతులకు యూరియా సమస్య తీవ్రంగా మారిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్యే యూరియా సరఫరాపై భిన్నాభిప్రాయాలు వినిపించడం రైతులను మరింత గందరగోళానికి గురి చేసిందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అవగాహన లేని వ్యాఖ్యలేనని, లక్ష కోట్లు అవినీతి అంటూ మాట్లాడటం అర్థరహితమని లక్ష్మీ నరసింహారావు స్పష్టం చేశారు. అభివృద్ధి నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి, సీనియర్ నాయకులు తీగల రవీందర్ గౌడ్, పొలాస నరేందర్, బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, నరాల శేఖర్, గోలి మహేష్,శంకర్, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్ రూరల్ మండలాధ్యక్షుడు గుస్కుల రవి, నాయకులు నీలం శేఖర్,కొండ కనకయ్య, వాసాల శ్రీనివాస్, యమ తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, చేపూరి రవీందర్, అంజాద్ పాషా ఉమర్, రఫీక్ లతో పాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలిచల్మెడ లక్ష్మీ నరసింహారావు..

వేములవాడ, సెప్టెంబర్ 08 (భారత శక్తి) : జేఎన్టీయూ



విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వారి న్యాయమైన డిమాండ్లను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. సోమవారం జేఎన్టీయూ విద్యార్థులు తమ డిమాండ్ల సాధనకై ధర్నా,రాస్తారోకో చేయడంతో వారిని పోలీసులు అడ్డుకొని దౌర్జన్యంగా పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న చల్మెడ లక్ష్మీ నరసింహారావు పోలీస్ స్టేషన్ లో ఉన్న విద్యార్థుల వద్దకు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ సిరిసిల్లలో జేఎన్టీయూ యూనివర్సిటీ స్థాపనకు 20 ఎకరాల భూమిని కేటాయించి, రూ.450 కోట్లతో పనులు ప్రారంభించేందుకు జీవో జారీ చేశారని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు తరగతి గదులు, హాస్టల్, ఉపాధ్యాయులను కూడా ఏర్పాటు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వైస్ ప్రిన్సిపాల్, కలెక్టర్కు పలుమార్లు తెలియజేసినా నిర్లక్ష్యం చేశారు. ఈ కారణంగానే రాస్తారోకోకు దిగిన విద్యార్థులను నిర్బంధించడం సరైంది కాదు,ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయాలి బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అలాగే విద్యార్థులను పోలీసులు వెంటనే విడుదల చేయాలి అని చల్మెడ విజ్ఞప్తి చేశారు. వారి వెంట సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి,బొల్లి రామ్మోహన్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, నరాల శేఖర్, జోగిని శంకర్, గోలి మహేష్,మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్,నాయకులు నీలం శేఖర్, సందీప్ కుమార్ తో పాటు తదితరులు ఉన్నారు.

## పోలీస్ శాఖ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా ప్రజావాణి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్..

సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 8 :

సంగారెడ్డి పట్టణంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగం వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల నుండి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. వారి సమస్యలను ఓపికగా విని, సమస్య స్థితి, జాప్యానికి గల



కారణాల గురించి సంబంధిత ఎస్.హెచ్.ఓ లకు ఫోన్ ద్వారా మాట్లాడి.. వివరాలను తెలుసుకున్నారు. చట్టాన్ని అమలు పరచడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, చట్టప్రకారం కేసులను పరిష్కరించాల్సిందిగా యస్.హెచ్.ఓ. లకు సూచనలు చేశారు. జిల్లా ప్రజలు తమ సమస్యకు స్థానికంగా పరిష్కారం దొరకని సందర్భంలో నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛంధంగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలనువినియోగించుకోవాలని అన్నారు. సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించేందుకు, సత్వర న్యాయం చేసేందుకు, పోలీసుశాఖ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు శాఖ ముందు ఉంటుందని, జిల్లా ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలసిందిగా జిల్లా ఎస్పీ సూచించారు.

## అర్జీలు స్వీకరించి పరిష్కారానికి ఆదేశించిను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 08 (భారత శక్తి) : ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు స్వీకరించి పరిష్కారానికి ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో



సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీవ్ కుమార్ ఝా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి,త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 154 వచ్చినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 49, డీఆర్డీఓకు 32, గృహ నిర్మాణ శాఖకు 14, జిల్లా విద్యాధికారి కార్యాలయం 13, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 11, ఉపాధి కల్పన శాఖకు 7, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి ఐదు, ఎస్డీసీ, డీసీఎస్ఓ కు మూడు చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, ఎస్పీ ఆఫీస్, ఈఓ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రెండు చొప్పున, ఎస్సీ కార్పొరేషన్, ఏడీ ఎస్ఎల్ఆర్, జిల్లా వ్యవసాయ అధికారి, ఏడీ మైన్స్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, జిల్లా వైద్యాధికారి, నీటి పారుదల శాఖ అధికారి, ఈఈ పీఆర్, డీఐఈఓ, ఎల్డీఎం, మార్కెటింగ్ శాఖకు ఒకటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో గడ్డం నగేష్, వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తెరుచుకున్న శివాలయంపోటెత్తిన భక్తజనం..

మణుగూరు, సెప్టెంబర్ 08 (భారత శక్తి ) : ఆదివారం రోజు చంద్రగ్రహణం వలన గ్రహణ కాలంలో ప్రతికూల శక్తులను నివారించడానికి శివలింగాపురం లోని శ్రీశ్రీశ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయంను అర్చకులు ఎస్ ధనుంజయరావు మూసి వేశారు. ఆపై గ్రహణం ముగిసిన తర్వాత శుద్ధి ప్రక్రియలను పూర్తిచేసి, భక్తులను దర్శనం కోసం అనుమతించారు. సోమవారం తెల్లవారుజామున 4:30లకు శివాలయం తెరుచుకుంది. అర్చకులు ఎస్ ధనుంజయరావు సంప్రోక్షణ చేసి, అష్టాదశ అమృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు నీలకంఠేశ్వర స్వామి దర్శనమిచ్చారు. దర్శనం కోసం ఉదయం నుండే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి పోటెత్తారు. గ్రహణ సమయంలో చంద్రుడు ప్రతికూల శక్తులను విడుదల చేస్తాడని, వివిధ రాశులు వారు దైవిక శక్తిని ప్రభావితం చేస్తాయని విశ్వసించి వివిధ రకాల వస్తువులను అర్చకులకు దానం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శివాలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి కన్నులారా.. తన్వితీరా గర్భగుడిలో ఉన్న రెండు లింగాలను దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.



# యంగ్ ఛార్మింగ్ హీరో సన్నీ కునాల్ హీరోగా
# ఘనంగా 'రోహిణి' మూవీ ఆడియో లాంచ్..

యంగ్ ఛార్మింగ్ హీరో సన్నీ కునాల్ హీరోగా, దేవిక సాహూ, ఆశ హీరోయిన్లుగా,కె.వి నరసింహ రాజు సమర్పకులుగా, నిర్మాత కుశాల్ రాజు,దర్శకుడు నంగ కుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'రోహిణి' మూవీ ఆడియో వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో పాటలు, ట్రైలర్‌ను ఆవిష్కరించిన ముఖ్య అతిథులు టీఎఫ్‌సీసీ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత చదలవడ శ్రీనివాస్, త్రినేత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ పరమేశ్వరి మడపటి, హీరో కృష్ణసాయి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత చదలవడ శ్రీనివాస్ ట్రైలర్ లాంచ్ చేసి మాట్లాడుతూ.. " స్టామినా ఉన్న హీరో సన్నీ కునాల్ తప్పకుండా సక్సెస్ సాధిస్తాడు. రూపంలోనూ నటనలోనూ ఆకట్టుకున్న సన్నీ కునాల్ కు ఆల్ ది బెస్ట్. చిన్న సినిమాలు సక్సెస్ అయితే వేలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కిన రోహిణి సినిమా పెద్ద విజయం సాధించి నిర్మాత కుశాల్ రాజు మరిన్ని సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను" అన్నారు.టీఎఫ్‌సీసీ సెక్రటరీ, ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ.. " హీరో సన్నీ కునాల్ కు మంచి భవిష్యత్తు ఉంది. తప్పకుండా సినిమా ఇండస్ట్రీలో హీరోగా మంచి పేరు తెచ్చుకుంటాడు.. కంటెంట్ బాగుంటే ఏ సినిమా అయినా విజయవంతం అవుతుంది. ఇటీవల హిట్ అయిన 'లిటిల్ హార్ట్స్' లాగే , రోహిణి కూడా హిట్ అయి, కాంప్రమైజ్ కాకుండా సినిమా తీసిన నిర్మాత కుశాల్ రాజుకు డబ్బులు రావాలి. మరెన్నో మంచి చిత్రాలు తీస్తూ సినిమా ఇండస్ట్రీలో స్థిరపడాలి " అన్నారు.

దర్శకుడు నంగ కుమార్ మాట్లాడుతూ.. "ఈ సినిమా విజయవంతం కావడానికి యూనిట్‌లో ప్రతి ఒక్కరి కృషి ఉంది. ముఖ్యంగా డాక్టర్ రాజేంద్ర రాజు కాంచనపల్లి అందించిన సహకారం మా సినిమాకు బలం. పాటలకు వస్తున్న స్పందన సంతోషంగా ఉంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాను హిట్ చేయాలని కోరుతున్నాను" అన్నారు.

నిర్మాత కుశాల్ రాజు మాట్లాడుతూ.. "ఒక మంచి సినిమా అందించాలనే లక్ష్యంతో పని చేశాం. దర్శకుడు సంఘ కుమార్ అందించిన కొరియోగ్రఫీ ఫైట్స్ అదుర్స్. కెమెరామెన్ అభినయ్ ప్రతిభ రోహిణి సినిమాకు హైలైట్. అందుకే సినిమా బాగా వచ్చింది. త్వరలోనే విడుదల చేసే మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాము " అన్నారు.

హీరో సన్నీ కునాల్ మాట్లాడుతూ.. "మేమంతా ఎంతో కష్టపడ్డాం. ఆ కష్టానికి తగిన ఫలితం రావాలి. ప్రేక్షకులు నచ్చే సస్పెన్స్,

మెచ్చే రొమాన్స్ అండ్ థ్రిల్లింగ్ అంశాలు రోహిణి లో చాలా ఉన్నాయి. ప్రేక్షకుల ఆదరణ కావాలి. సినిమాను సూపర్ హిట్ చేయండి. " అన్నారు. హీరోయిన్లు దేవిక సాహూ మాట్లాడుతూ.. "పాటలు బాగుంటే సినిమా హిట్ అవుతుంది. రోహిణి పాటలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా కూడా చాలా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరూ థియేటర్‌కి వెళ్లి ఈ సినిమాను విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం. మాకు అవకాశం ఇచ్చిన నిర్మాత కుశాల్ రాజు కు దర్శకులు సంఘ కుమార్ కు ధన్యవాదాలు" అన్నారు.

రిక్ రైటర్ డాక్టర్ దాసరి వెంకటరమణ మాట్లాడుతూ.. "ఈ సినిమాకు సింగల్ కార్డు తో పాటలు రాసే అవకాశం ఇచ్చిన మిత్రుడు డాక్టర్ రాజేందర్ రాజు కాంచనపల్లికి కృతజ్ఞతలు. పాత సినిమాల మాదిరిగా మధురమైన సాహిత్యంతో రాశాను. పాటలు అందరికీ నచ్చుతాయి " అన్నారు. ప్రముఖ కవి, రచయిత, కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ ఈ చిత్రంలోని అన్ని పాటలు రాయగా, సంగీతాన్ని ఆనంద్ అందించారు.

" నవరసాలు పలికించిన డాక్టర్ దాసరి వెంకటరమణ పాటలు వినసొంపుగా, కనువిందుగా ఉన్నాయి. మా ఇలవేల్పు శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్యానర్ పై వస్తున్న రోహిణి చిత్రం కుశాల్ అండ్ కునాల్ కు మంచి పేరు తీసుకువస్తుంది. సినిమా ఇండస్ట్రీలో ఇద్దరికీ స్థిరమైన మంచి భవిష్యత్తు ఉండాలని మా ఇష్ట దైవం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని వేడుకుంటున్నాను. ఇంత గొప్ప సినిమాకు సమర్పకుడిగా ఉన్నందుకు గర్వంగా ఉంది. నా జన్మ ధన్యమైంది." అని సమర్పకులు కెవి నరసింహ రాజు తెలిపారు.

చిత్ర పర్యవేక్షకులు డాక్టర్ రాజేంద్ర రాజు కాంచనపల్లి ఆకట్టుకునే వ్యాఖ్యానంతో వేడుకను విజయవంతం చేశారు." పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న రోహిణి సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది."

సినీ ప్రముఖులు రఘు బత్తుల, %జ%. వేణుగోపాల్, సినీ రచయిత డాక్టర్ వెనిగళ్ళ రాంబాబు, నిర్మాత లయన్ శ్రీరామ్ దత్తి, దర్శకులు అలహరి, సింహ శ్రీ మిద్దె, బిల్డర్స్ యువ రాజు, కృష్ణ, స్పందన, నగధర్ రాజు, రవీందర్ రాజు, చలపతి, రాపోలు దత్తాత్రి, పోలీస్ అధికారులు రాజా, రవి, ఖాజానా, తదితరులు రోహిణి ఆడియో వేడుకలో పాల్గొన్నారు.

చంద్ర గ్రహణం ఉన్నా సరే పాత్రికేయ మిత్రులతో,సినీ అభిమానులతో హాల్, కిక్కిర్సి పోవడం విశేషం .

ఈ చిత్రానికి మాటలు: మెండెమ్ శ్రీధర్.. కెమెరా: అభినయ్ సంగ. కో ప్రొడ్యూసర్: దేవకి.. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: షేక్ వలీ పాషా..

అసోసియేట్ రైటర్: అక్బర్ చక్రవర్తి.. కో రైటర్స్ : మధురిమ, ప్రియ, ముత్యాల సరాలు జి. హరి ప్రసాద్, బోయినపల్లి రమణా రావు, కే.కే... పీ.ఆర్.ఓ. : కదలి రాంబాబు, దయ్యాల అశోక్.. పబ్లిసిటీ డిజైనర్: వివ రెడ్డి.








## రూ. 5,22,000 లకు లడ్డూను దక్కించుకున్న రాజేంద్రప్రసాద్ కళ్యాణి దంపతులు.


ఎల్బీనగర్, సెప్టెంబర్ 08 (భారత శక్తి):

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘము అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త ఆధ్వర్యంలో మహా గణపతి 38వ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.గణేష్ మహారాజ్ లడ్డూ వేలం పాటలో వాసవి కాలనీకి చెందిన రాజేంద్ర ప్రసాద్, కళ్యాణి దంపతులు రూ. 5,22,000 లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిమజ్జన కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎంతో ఘనంగా వైభవంగా నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, అష్టలక్ష్మీ దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ మాద్యం సుధాకర్ గుప్తా, బంధం దామోదర్ గుప్తా, ఉత్సవ కమిటీ కన్వీనర్ బచ్చు ప్రభాకర్, కో- కన్వీనర్ వెంపటి కృష్ణమోహన్, గౌరిశెట్టి శ్రీనివాస్, అరుణ్ కుమార్, వనమా సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే అనిల్, తమన్నా శ్రీధర్, భరద్వాజ్, దండు రాజు, లగిశెట్టి వినోద్ కుమార్, గౌరీ శంకర్, సత్యనారాయణ, మాలే శ్రీనివాస్, శుభకర్, కృష్ణమూర్తి, రామస్వామి, మేఘమాల, భ్రమరాంబ, గోలి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

కడప, (భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 08: కాసినయన మండలంలోని నరసాపురం గ్రామం లో ఇటీవల మాబుపీరా అనే యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే.. విషయం తెలుసుకున్న బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా ఆదుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.అంబులెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం తో యువకుడు మృతి చెందడాని ఆమె కు తెలిపారు..ఆమె వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.అక్కడి వైద్యురాలితో యువకుడి మృతి గురించి ఆరా తీశారు..అనంతరం జిల్లా వైద్యాధికారి కి ఫోన్ చేసి ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించే ప్రతి ఒక్క అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు రాత్రి సమయంలో ఒక నర్సు,వాచ్మెన్ ను నియమించాలని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు .ఆమెతో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## సమగ్ర తుది ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి:
### హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి మరియు జీహెచ్ఎంసీ కమిషనర్

హైదరాబాద్, సెప్టెంబర్ 8, 2025:జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా సమగ్రంగా సిద్ధం చేసేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు.సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు .భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా సెప్టెంబర్ 2, 2025న ప్రచురించామనీ అన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం 139 లొకేషన్ లు, 407 పోలింగ్ స్టేషన్లు ఉండగా 3 లక్షల 92 వేల 669 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.ఈ జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందజేసినట్లు, అలాగే తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్లలో కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి, పారదర్శకంగా, ఖచ్చితంగా జాబితా సవరణలో భాగస్వాములు కావాలని పార్టీ ప్రతినిధులను కోరారు. సెప్టెంబర్ 17 వరకు దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉందన్నారు.జూలై 1, 2025 నాటికి 18 ఏళ్లు పూర్తిచేసుకున్న అర్హులైన పౌరులు, సెప్టెంబర్ 17లోపు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలన్నారు.జాబితాలో ఏవైనా సవరణలు, మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే సెప్టెంబర్ 17లోపు సంబంధిత దరఖాస్తు ఫారాలు సమర్పించాలని చెప్పారు.ఇప్పటి వరకు ఫారం-6, 6%ూ%, 7, 8 ద్వారా వచ్చిన 2,855 దరఖాస్తులు , అభ్యంతరాల్లో 8.62 శాతం దరఖాస్తులను పరిష్కరించామని, మిగతా దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కర్ణన్ తెలిపారు.జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి అర్హులైన ఓటరును జాబితాలో చేర్చేందుకు, తప్పులేని ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు రాజకీయ పార్టీల సహకారం అత్యంత అవసరమని అన్నారు.తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 30, 2025న ప్రచురించబడుతుందని పేర్కొన్నారు.సమావేశానికి ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి విజయవన్ శి, అదనపు కమిషనర్ (ఎలక్షన్స్) మంగళతాయారు హాజరయ్యారు.రాజకీయ పార్టీల తరపున నందేశ్ కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ), పి. వెంకటరమణ, పవన్ కుమార్ (భారతీయ జనతా పార్టీ), విజయ్ మల్లంగి (ఆమ్ ఆద్మీ పార్టీ), ఎం. శ్రీనివాసరావు (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా%-%మార్క్సిస్టు), రాజేష్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), వై. జయసింహ, కె. మాధవ్ (భారత్ రాష్ట్ర సమితి), కె. జోగేందర్ సింగ్, ప్రశాంత్ యాదవ్ (తెలుగుదేశం పార్టీ), సయ్యద్ ముస్తాక్ (ఎఐఎంఐఎం) తదితరులు హాజరయ్యారు.సమావేశానికి ముందుగా, హైదరాబాద్ జిల్లాలో జీఐఎస్ ఆధారిత నజరి నక్ష తయారీ కార్యాచరణ ప్రణాళికపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు.





## రికార్డు స్థాయిలో లడ్డు వేలం - 25,01,116కి ఒగ్గు సాయికిరణ్ యాదవ్ సొంతం

పటాన్‌చెరు సెప్టెంబర్ 8 భారత శక్తి సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో నందారం యువసేన ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డు వేలం ఘనంగా జరిగింది. ఈ సారి జరిగిన పోటీపోటీ లడ్డువేలంలో రికార్డు స్థాయిలో ?25,01,116కి లడ్డును సంసిద్ధి గ్రూప్ సీఈఓ ఒగ్గు సాయికిరణ్ యాదవ్ కైవసం చేసుకున్నారు.లడ్డును అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, గూడెం మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా ఒగ్గు సాయికిరణ్ స్వీకరించారు.ఈ సందర్భంగా నరసింహా గౌడ్ మాట్లాడుతూ 36 ఏళ్లుగా గణనాథుడి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం. ఈసారి లడ్డు రికార్డు స్థాయిలో అమ్ముడవడం గణనాథుడి కరుణ అని అన్నారు.లడ్డు కైవసం చేసుకున్న ఒగ్గు సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ మూడేళ్లుగా లడ్డు కొనే ఆరాటం నెరవేరింది. ఈసారి ఎలాగైనా లడ్డు దక్కించుకోవాలని సంకల్పంతో వచ్చి, రికార్డు స్థాయిలో లడ్డు సాధించడం సంతోషంగా ఉంది అని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నందారం యువసేన సభ్యులు, స్థానిక నాయకులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని వైభవంగా మార్చారు.



# యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు



వైయస్సార్ కడప, సెప్టెంబర్ 08:

నిత్యా వసర వస్తువుగా ఉన్న యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూరియా సరఫరా, ఉల్లి కొనుగోలు సంబంధిత అంశాలపై సి ఎస్ కే విజయా నంద్ తో కలిసి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు వైఎస్ఆర్ కడప జిల్లా సచివాలయం నుండి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ..రైతులకు ఎక్కడా యూరియా సమస్య లేకుండా చూడాలని, యూరియా ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు వచ్చే రబీ సీజన్ కు ఇప్పటి నుండే యూరియా సరఫరా కు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు ఎరువులపై భరోసా, ఎరువులు దొరకవని ఆందోళనతో ఒకేసారి కొనుగోలు చేయకుండా నిల్వ చేసి పెట్టుకోకుండా చూడాలని సీఎం సూచించారు. వై ఎస్ ఆర్ కడప జిల్లాలో ఉల్లి పంట కొనుగోలు కొరకు వ్యవసాయ మార్కెట్ కమిటీలు కమలాపురం, మరియు మైదుకూరులలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈనెల నాలుగో తేదీ నుండి ఉల్లిపంట కొనుగోలు ప్రక్రియ జరుగుతున్నదని,ఉల్లి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం చేస్తున్నదని,ఈ సీజన్ లో ఉల్లి పంట పండించిన రైతులు మరో 10 రోజుల తరువాత పంట కోసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ తో పాటుజిల్లా వ్యవసాయ ఉద్యానవన మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ శిబిరం విజయవంతం

వేములవాడ,సెప్టెంబర్ 08 (భారత శక్తి ) : రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో,లయన్స్ క్లబ్ ఆఫ్



వేములవాడ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని మాతృశ్రీ హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో మొత్తం 110 మంది హాజరై కంటి, రక్తపరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 38 మంది రోగులను కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ కోసం ఎంపికైన వారిని వేములవాడ నుంచి రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, ఆపరేషన్ అనంతరం మందులు, కంటి అద్దాలు, భోజనం కూడా పూర్తిగా ఉచితంగా అందజేస్తామని తెలిపారు.ఈ శిబిరానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ లైన్స్ క్లబ్ నాయకులు కోళ్ల శ్రీనివాస్, రూరల్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, బచ్చు వంశీకృష్ణ, కటకం శ్రీనివాస్, డాక్టర్ కోయినేని ప్రవీణ్, రవి వైద్యులు, మెడికల్, లైన్స్ క్లబ్ నిర్వాహకులు తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో మాక్ డ్రిల్ అత్యవసర సంసిద్ధతను బలోపేతం చేయడంపై దృష్టి

## విపత్తు సమయంలో ఒడుపుగా వ్యవహరించడంపై శిక్షణ





పటాన్‌చెరు సెప్టెంబర్ 8 భారత శక్తి

సంక్షోభ పరిస్థితులలో విద్యార్థులు, సిబ్బంది భద్రతను నిర్ధారించడానికి, అత్యవసర సంసిద్ధతను బలోపేతం చేసి, విపత్తు సమయంలో ఒడుపుగా వ్యవహరించడంపై శిక్షణ ఇచ్చేందుకు గాను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం మాక్ డ్రిల్ ను నిర్వహించారు.అంతేగాక, గాయపడిన వ్యక్తులు, వయసు మళ్లినవారు, మహిళలు, ఇతరులను దుర్బలమైన ప్రదేశాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించి, రక్షించడంలో సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి కూడా ఈ మాక్ డ్రిల్ ఉపకరించింది. ఆకస్మిక అగ్ని ప్రమాదాలు, లేదా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే ఆ సమాచారాన్ని నిర్ధారించుకుని తక్షణమే స్పందించడం గురించి విద్యార్థులు, సిబ్బందిలో అవగాహన కల్పించడం లక్ష్యంగా ఇది సాగింది.ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ పర్యవేక్షణలో డైరెక్టర్ ఆఫ్ సెక్యూరిటీ సీనియర్ మేనేజర్ సంతోష్ కుమార్ యాదవ్ అడ్లా ఈ మాక్ డ్రిల్ కు నేతృత్వం వహించారు. ఇందులో పలువురు సెక్యూరిటీ అధికారులు, పర్యవేక్షకులు, గార్డులతో పాటు వైద్య సిబ్బంది కూడా పాల్గొన్నారు.అగ్ని సంబంధిత సంఘటనలు, అత్యవసర పరిస్థితులను నిర్వహించడంపై విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. తక్షణం ఎలా స్పందించాలి, ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి, ఏయే పనులు చేయకూడదో వివరించారు. అగ్నిమాపక భద్రతా చర్యలు, అగ్నిమాపక పరికరాల వినియోగం, సంక్షోభాల సమయంలో త్వరిత నిర్ణయం తీసుకోవడంపై ప్రదర్శనలతో సహా భద్రతా సిబ్బంది ఆచరణాత్మక శిక్షణను అందించారు. ఈ మాక్ డ్రిల్ లో దాదాపు 300 మంది విద్యార్థులు, సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.ఇటువంటి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించి, భద్రతా సంస్కృతిని పెంపొందించడంలో గీతం బలమైన నిబద్ధతను ఈ మాక్ డ్రిల్ ప్రతిబింబించింది.

## ఫిర్యాదుకు వెనుకాడని సామాన్యులు

# హైడ్రాప్రజావాణిలో 36 ఫిర్యాదులు

హైదరాబాద్, సెప్టెంబరు 08: భారత శక్తి

పార్కులు, రహదారులు, చెరువులు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జా విషయంలో ఫిర్యాదు చేయడానికి సామాన్యులు కూడా వెనుకాడడంలేదు. అర్థబలం, రాజకీయ అండదండలున్నవారని మనకెందుకు అనుకోవడంలేదు. పార్కులు




కబ్జా అవుతున్నా.., తామెళ్లేందుకు వీలు లేకుండా రహదారులు ఆక్రమణలకు గురౌతున్నా ఊరుకోవడంలేదు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణిలో మొత్తం 36 ఫిర్యాదులు అందాయి. పార్కు స్థలాన్ని ఇష్టానుసారం వినియోగిస్తున్నారని.. చెరువుల్లోకి మురుగు నీరు చేరడంతో తమ నివాసాలు ముంపునకు గురౌతున్నాయని ఫిర్యాదులందాయి. రహదారులు, పార్కులు కబ్జా కాకుండా చూడాలని పలువురు ఫిర్యాదులు అందజేశారు. నాలాలపై అక్రమ కట్టడాలున్నాయని.. ఆఖరకు విద్యుత్ హై టెన్షన్ వైర్ల కింద కూడా నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొన్నారు. తమ ఇంటికి దారి బంద్ చేశామని ఒకరు, రోడ్డును ఆక్రమించేశారని మరొకరు ఫిర్యాదులు చేశారు. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కళ్ల ముందే కబ్జాలకు గురి అవుతున్నాయని వాపోయారు. ఇలా వచ్చిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించారు. ఫిర్యాదుదారుల సమక్షంలోనే గతంలో ఎలా ఉండేది.. ఇప్పుడు ఎలా ఉందో గూగుల్, శాటిలైట్ మ్యాప్‌ల ద్వారా వివరించి.. సంబంధిత అధికారులకు ఆ సమస్యల పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

ఫిర్యాదులు ఇలా..

పటాన్‌చెరులోని ఏపీఆర్ ప్రవీణ్ లగ్జారియాలోని పార్కు స్థలంలో రాత్రికి రాత్రి గుడి కట్టేస్తున్నారంటూ హైడ్రా ప్రజావాణిలో అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇదేమని అడిగితే దాడికి దిగారని వాపోయారు. దాదాపు 39 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లే ఔట్‌లో 500ల వరకూ విల్లాలుండగా.. ఇందులోని పార్కుకు కేటాయించిన స్థలంలో గుడి కడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలోని చిన్న బంధం చెరువును ఇరువైపుల నుంచి కబ్జాలు చేసేస్తున్నారని.. చెరువులోని నీళ్లన్నీ కిందకు వదిలేస్తున్నారని గాజులరామారం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. చెరువు వాస్తవ విస్తీర్ణం ఎంతనేది నిర్ణయించి ఫెన్సింగ్ వేయాలని కోరారు. ఇప్పుడే నీళ్లన్నీ కిందకు వదిలేస్తే.. వేసవిలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోతాయని వాపోయారు.

రాజేంద్రనగర్ మండలం బండ్లగూడ విలేజ్‌లోని పీ అండ్ టీ కాలనీలో అర ఎకరం పార్కు కబ్జాకు గురి అవుతోందని ఆకాలనీ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలోని గండిపేట మండలం గంధంగూడ గ్రామంలోని 3.28 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురి అవుతోందని పలువురు ఫిర్యాదు చేశారు.

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మాచ బొల్లారం గ్రామంలోని ముతుకుల కుంట నీటి విస్తీర్ణం రోజురోజుకూ పెరిగిపోతోందని.. 4.62 ఎకరాల చెరువు కాస్త 12 ఎకరాలు దాటిపోయిందని అక్కడి నివాసితులు వాపోయారు. తూములు బంద్ చేసి, అలుగును కూడా పెంచేశారంటూ ప్రజావాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమతి పొందిన లే ఔట్‌లు నీట మునుగుతున్నాయని వాపోయారు.

# వికలాంగులకు,చేయూత పెన్షన్ దారులకు వెంటనే పెన్షన్ పెంచాలి ఎమ్మార్పీఎస్

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 8:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం వికలాంగులకు రూ 6000/- మరియు చేయుత పెన్షన్ దారులకు రూ 4000/- వెంటనే పెన్షన్ పెంచాలని వి ఎస్ రాజు మాదిగ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా, వి ఎస్ రాజు మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు జిల్లా ఇన్చార్జి, మరియు రామారావు శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ పాల్గొన్నారు. .వికలాంగులకు మరియువృద్ధులకు,వితంతువులకు,ఒంటరి మహిళలకు,చేనేత కార్మికులకు,బీడీ,గీత కార్మికులకు మరియు కండరాల క్షీణత రూ 15000/- పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు రూ 4000 /-నుండి రూ 6000,/-మరియు చేయూత పెన్షన్ దారులకు రూ 2000/- నుండి రూ 4000 /-ఇస్తానని ఎన్నికలలో హామీ ఇచ్చి ఇప్పటికి రేవంత్ రెడ్డి సర్కార్ అధికారం లోకి వచ్చి 21 నెలలు గడిచిపోయిన ఇప్పటివరకు వారికి పెన్షన్ పెంచలేదని విమర్శించారు.పెన్షన్ పెంచకుండా



నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ రెడ్డి తీరుకు నిరసనగా ఈ రోజు వికలాంగుల హక్కుల పోరాట సమితి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు పెన్షన్ దారులతో మహాధర్నా నిర్వహించారు.

తదనంతరం జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఎం మ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పెన్షన్ పెంచాలని అనేక రకాలుగా పోరాటం చేస్తూనే ఉన్నాము. పెన్షన్ దారులకు వెంటనే పెన్షన్ పెంచాలని తమరు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరడం జరిగింది, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, నేత, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మడపాటి రవికుమార్

విహెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు, దేవరంపల్లి అశోక్, విహెచ్పిఎస్ జిల్లా కన్వీనర్, పెద్ద గీత మాదిగ ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు, విహెచ్పిఎస్ జిల్లా కో కన్వీనర్లు తుమ్మల యాదగిరి,నర్సిములు, పొట్టొలా వెంకటేష్ పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జ్, సదాపుల కృష్ణ మాదిగ సీనియర్ నాయకులు, సుధాకర్ విహెచ్పిఎన్ కొండాపూర్ మండల్,రామ్ శెట్టి వి హెచ్ పి ఎస్ జహీరాబాద్ నాయకులు, ముక్క గళ్ళ కవిత ఎమ్మెస్ జిల్లా అధ్యక్షురాలు,నల్లొల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బాపనపల్లి రవి మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, నటరాజ్ మాదిగ, కొంగేరి కృష్ణ ,జంగం విజయ్ కుమార్, రవికుమార్ బిహెచ్ఇఎల్, మల్లెపల్లి శ్రీకాంత్, రాజేందర్ మరియు జిల్లా, మండల్ ఎం ఆర్ పి ఎస్ అనుబంధం సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 59వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం.

కడప, సెప్టెంబర్ 8(భారత శక్తి): వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో కడప కోటి రెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో సోమవారం 59వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు, అధ్యాపకులు,



అధికారులు, వయోజన విద్యా శాఖ సిబ్బంది విశేషంగా పాల్గొనడంతో కళాశాల ఆవరణ సందడిమయమైంది.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీం భాషా గారు అధ్యక్షత వహించారు. అధ్యక్ష ఉపన్యాసానికి ముందు ఆయన కవిగా ఒక అర్థవంతమైన కవితను వినిపించి సభలోని ప్రతిఒక్కరి ప్రశంసలు అందుకున్నారు. "అక్షరం మనిషిని వెలుగులోకి నడిపించే దీపస్తంభం" అని ఆయన ప్రేరణాత్మకంగా పేర్కొన్నారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ గారు స్త్రీ విద్య ప్రాధాన్యతను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ %-% "స్త్రీ చదువుకుంటే కుటుంబం చదువుతుంది, స్త్రీ అక్షరాస్యతతో సమాజం అభివృద్ధి చెందుతుంది" అని అన్నారు.విశిష్ట అతిధి గా హాజరైన రెవెన్యూ అధికారి శ్రీ యం. విశ్వేశ్వర నాయుడు గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి దృష్టిలో స్త్రీ విద్య, విజన్, టెక్నాలజీ, డిజిటల్ లిటరసీపై ఆలోచనలు పంచుకుని, సమాజంలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యత సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.తరువాత జిల్లా ఉప విద్యా శాఖ అధికారి జి. రాజగోపాల్ రెడ్డి గారు వయోజన విద్యాశాఖ విధి విధానాలను వివరించారు. "అక్షరాస్యత కేవలం చదవడమే కాదు, పౌరజీవనానికి మార్గదర్శి" అని ఆయన అన్నారు.సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ అధికారి శ్రీ ఏ. నిత్యానంద రాజు గారు పౌర బాధ్యతపై చక్కని ప్రసంగం చేశారు. "అక్షరాస్యతతో వ్యక్తి తన హక్కులు, కర్తవ్యాలు అర్థం చేసుకుంటాడు" అని ఆయన చెప్పారు.వయోజన విద్య ఉప సంచాలకులు శ్రీ యం.వి. సుబ్బారెడ్డి గారు విద్య ప్రాధాన్యతను రుచికరంగా వివరించారు. "చదువుకున్న వాడే సమాజానికి మార్గదర్శి అవుతాడు" అని ఆయన ఉద్ఘాటించారు.సూపర్వైజర్ శ్రీ సోమశేఖర రెడ్డి గారు "ఈచ్ వన్ %-% టీచ్ వన్" అనే నినాదాన్ని వినిపించారు. "అన్నం ఎంత ముఖ్యమో, అక్షరం అంతే ముఖ్యమని" ఆయన భావోద్వేగంగా చెప్పారు. "సంపూర్ణ అక్షరాస్యత సాధించేదాకా వెనుదిరగం" అని ఆయన నినదించారు.అలాగే సూపర్వైజర్ శ్రీమతి మాధవి లత గారు, సర్వ శిక్షా అభియాన్ %హామీ% శ్రీ వీరేంద్ర గారు పిల్లలకు అక్షరాస్యత విలువలను ప్రతిపాదించారు. "పిల్లలు చదువుకుంటేనే భారత భవిష్యత్తు బలపడుతుంది" అని వారు సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, నృత్య పోటీలలో విజేతలైన విద్యార్థినులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది.కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల శాఖ అధ్యాపకులు డాక్టర్ కేశవరెడ్డి గారు, శ్రీమతి జి.పి. ఆశాలత గారు, పొలిటికల్ సైన్స్ విభాగం డాక్టర్ పి.వి. సుబ్బారెడ్డి గారు, తెలుగు శాఖకు చెందిన డాక్టర్ యం.వి.యన్. సుధారాణి గారు పాల్గొన్నారు. విద్యార్థులు మరియు డ్వాక్రా మహిళలు ఉత్సాహంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమం చివర్లో "అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి %-% చదువు ప్రతి ఒక్కరి హక్కు" అనే సంకల్ప నినాదాలతో సభ ప్రతిధ్వనించింది.

# యూరియా దోపిడీ అరికట్టాలి : సీపీఐ

పోరుమామిళ్ళ, (భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 08: రాష్ట్రంలో యూరియా కొరత తీర్చా లని, ఎరువుల కేటాయింపులోరైతు సేవాకేంద్రాలు,ప్రాథమికవ్యవసాయ సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయించే డీలర్ల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ మండలకార్యదర్శి.రవికుమార్, సహాయ కార్యదర్శి కేశవలు డిమాండ్ చేశారు. సోమవారం పోరుమామిళ్ల మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ పార్టీ నేతలు యూరియా కొరతను అరి కట్టి,రైతులకు అరికట్టాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం.లో ఎరువుల కొరత పర్యావసానం యూరియా అందుబాటులో లేకపో వడం వల్ల రైతులు అనేక ఇబ్బందు లు పడుతున్నారు గతేడాది ఇదే సీజన్లో ఎటువంటియూరియాకొరత సమస్యరాలేదన్నారు. ఈసంవత్స.రం మాత్రమే యూరియా సమస్య తీవ్రంగా ఉందన్నారు..రాష్ట్రప్రభుత్వం మాత్రం యూరియా నిలవలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ రైతు లకు అందంటం లేదన్నారు.కేంద్ర నుంచి వచ్చిన యూరియాను 80 శాతం ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాపులకు తరలిస్తున్నారన్నారు. 20శాతంమాత్రవే రైతు సేవా కేంద్రాలకుప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సరఫరా చేస్తున్నారు. ఈ యూరియాను కూడా స్థానికకూటమి నాయకులు అవసరానికి మించి తీసు కుపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగా ప్రవేట్ ఫెర్టిలైజర్ షాప్ల వారు ఒక బస్తా యూరియా (45 కేజీలు) 266రూపాయల కు అమ్మా లసి ఉండగా బ్లాక్ మార్కెట్లో300 నుంచి 400 వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. యూరియా కావాలంటే అవసరం లేని ఎరు వులను కొనుగోలు చేయాలని రైతులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. సమీక్షలకు మాత్రమే పరిమితమవుతున్నది. వరి పంటకు కనీసం ఖరీఫ్ సీజన్లో




ఎకరానికి రెండుబస్తాలుయూరియా అవసరం ఉంటుంది. కానీ ఒక బస్తా కూడా అందలేదు. పైగా సంవత్సరం సాగు విస్తరణ తగ్గిందన్నారు. రాయలసీమ ప్రాంతాల్లో వేరుశనగ సుమారు 13 లక్షల ఎకరాల సాగు కావలసి ఉండగా కేవలం 4.24 ఎకరాల్లో మాత్రం సాగైందన్నారు. కేసీ కెనాల్, మైలవరం ఆయకట్టు,

వరి సాగు చేసే ప్రాంతాలు. రైతులు యూరియా కోసం రైతు సేవ కేంద్రాల వద్దకు పోతే ఒక ఆధార్ కార్డుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారన్నా రు,పోనీ డీలర్ల వద్ద యూరియా కొందామంటే యూరియాతో పాటు ఇతర ఎరువులు కొనాలన్న షరతులుపెట్టి అధిక ధర పెట్టాల్సి వస్తోందన్నారు.

యూరియా కొరత తీర్చాలని, ఎరువు.ల కేటాయింపులో రైతు సేవాకేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయించే డీలర్ల పై క్రిమినల్ కేసులు నమోదు చేయా లని డిమాండ్ చేశారు. అనంతరం వారు డిప్యూటి తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ, ఎఐటియుసి నాయకు లు పీరయ్య, శ్రీనివాసులు,చెన్నయ్య, రంగాచారి,గురమ్మ,జ్యోతి,ఆదేమ్మ,విశ్వాసమ్మ,షాహిదా తదితరులు పాల్గొన్నారు.,

## జీవితం ఒక వింత నాటకం ఒక్కో మనిషిది, ఒక్కో గాధ..

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 8: బీహార్ నుంచి వలస వచ్చి పటాన్చెరు నియోజకవర్గం బొంతపల్లిలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న



కుటుంబం తన కొడుకు చోటు(27) వివాహం తర్వాత తన భార్య ఎవరితోనో వెళ్లిపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఈ దుర్ఘటనతో వారి కుటుంబం దిక్కుతోచని స్థితిలో మిగిలిపోయింది. ఈ క్లిష్ట సమయంలో ఎం డి ఆర్ ఫౌండేషన్ మానవతా ధర్మం మరువకుండా వారి అంత్యక్రియలను నిర్వహించి అండగా నిలిచింది.మనిషి ఎంత కష్టాల్లో ఉన్నా ఆత్మహత్య పరిష్కారం కాదు. మనసుకు భారంగా అనిపించినప్పుడు మన దగ్గర వాళ్లతో, స్నేహితులతో, సమాజంలో అందుబాటులో ఉన్న సహాయ కేంద్రాలతో మాట్లాడాలి. మనసు విప్పి చెప్పడం వల్లనే సమస్యలకు మార్గాలు దొరుకుతాయి.

## గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ళ, ( భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 08: పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ లెక్షరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్యామ్యుల్ డేవిడ్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు పీజీలో హిస్టరీ సబ్జక్టునందు యాభై ఐదుశాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరని, అనుభవం మరియు నెట్, సెట్ మరియు పి హెచ్ డి ఉన్న వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడునని, కళాశాల విద్యా శాఖ కమీషనర్నియమావలి ప్రకారం అర్హులైన వారు ఈ నెల పదవ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాల ఆఫీసు నందు బయోడెట మరియు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను అందజేయాలని, వివరాలకు 9052287046 నంబరును సంప్రదించాలని తెలిపారు.

## జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం..

కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 08: సోమవారం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో జిల్లా





కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రెండు రోజులు జిల్లలో వర్షాలు పడే సూచన ఉంది కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ జిల్లా అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రేషన్ కార్డు అప్లికేషన్స్ డిస్పోజ్ చేయాలని సూచించడం జరిగింది. గ్రామ పాలన అధికారులకు రేపటి లోగా విలేజ్ లు అలాట్ చేయడం జరుగుతుంది వారికి రేషన్ కార్డు వెరిఫికేషన్, భూ భారతి అప్లికేషన్స్ వెరిఫికేషన్ కొరకు వాడుకోవాలని సూచించారు.

## ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 08: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఈరోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో, ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సంవత్సరం (41) మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఐ.ఏ.ఎస్, శాసన మండలి సభ్యులు సి హెచ్. అంజి రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చందర్ నాయక్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి ఆర్.డి.వో. వీణ, జిల్లా విద్యాశాఖ అధికారి, కామారెడ్డి ఎస్. రాజు, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



## ఎన్‌హెచ్ - 44, సదాశివనగర్ లిమిట్స్ లో స్పీడ్

కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 08: ప్రజల ప్రాణాలను కాపాడేందుకే వేగ నియంత్రణ ఏర్పాట్లు



- నిబంధనలు ఉల్లంఘించిన వారికి స్పీడ్ లేజర్ గన్స్ ద్వారా చాలనాలు జారీ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న భద్రతా చర్యలు, కట్టుదిట్టమైన నిబంధనల అమలు ఫలితంగా ఈ సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది.

2024 ఆగస్టు వరకు జిల్లాలో మొత్తం 188 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, 2025 ఆగస్టు వరకు వాటిని 145కి తగ్గించగలిగాం. దీని ద్వారా మొత్తం 22.9% తగ్గుదల నమోదైంది. అదేవిధంగా మరణాలు 197 నుండి 153కి తగ్గి 22.3% తగ్గుదల ఉన్నది. అలాగే గాయపడ్డ కేసులు కూడా 181 నుండి 173కి తగ్గగా, గాయపడిన వ్యక్తులు 355 నుండి 298కి తగ్గడం ద్వారా రోడ్డు ప్రమాదాల నియంత్రణలో గణనీయమైన తగ్గుదల నమోదైంది. ఇది జిల్లా స్థాయిలో రోడ్డు భద్రతా చర్యల విజయాన్ని సూచిస్తూ, ప్రజల ప్రాణ రక్షణలో ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది.

రోడ్డు ప్రమాదాల తగ్గుదలకు ప్రధాన కారణాలు ప్రతిరోజూ వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్‌లు, హెల్మెట్ %ఢ% లైసెన్స్ లేని వాహనదారులపై కఠిన చర్యలు, అతివేగంగా ప్రయాణించే వారిపై జరిమానాలు విధించడం అని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్, సదాశివనగర్, ఎన్‌హెచ్-44 వద్ద అయ్యప్ప ఆలయం సమీపంలో స్పీడ్ లేజర్ గన్స్ ను ప్రారంభించారు. జిల్లాలో మొత్తం మూడు స్పీడ్ లేజర్ గన్స్ వాహనదారుల వేగాన్ని నియంత్రించడం కొరకు పనిచేస్తున్నవి. అధిక వేగంతో ప్రయాణించే వాహనాలను గుర్తించి జరిమానాలు విధించి క్రమంగా వారి వాహణముల వేగనియంత్రణ చేయడం, తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రధాన ఉద్దేశం. ఇకపై ఈ లేజర్ గన్స్ జాతీయ రహదారి (ఎన్ హెచ్-44), జాతీయ రహదారి (ఎన్ హెచ్-161), రాష్ట్ర రహదారులపై ఉండును.

రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా మీ ప్రాణాన్ని, మీ కుటుంబ సభ్యుల ప్రాణాలను కాపాడుకోండి అని జిల్లా పోలీసు శాఖ ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

## 10న స్థానిక సంస్థల తుది ఓటరు జాబితా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8 (భారత శక్తి) : జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ఓటరు జాబితా ప్రదర్శన చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10న తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిప్యూటీ సి ఈ ఓ రాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.




# దవాఖానా లో... దురుసుగా ప్రవర్తన.!

### - డ్రైవర్లు ..ఆసుపత్రి ఉద్యోగులా..?
### - అసలు సూపరిండెంట్.. ఎవరు!?
### : యూనియన్ నాయకులు

ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08 (భారత శక్తి) : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో సిబ్బంది కొరతతో ఆసుపత్రికి వచ్చే రోగులు నానా రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, మెడికల్ కాలేజీకి అనుబంధంగా పనిచేస్తుండగా... తెలంగాణ వైద్య విధాన పరిషత్ క్రింద వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులను మారకపోతే ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నుండి ఏటూరు నాగారం, వాజేడు, వెంకటాపురం సి హెచ్ సీ ఆసుపత్రులకు బదిలీచేయగా... జనరల్ హాస్పిటల్ ఉన్నతాధికారి క్రింది స్థాయి సిబ్బంది కొరత ఉండటంతో ఏటూరు నాగారం, వాజేడు మండలాలలోనీ సి హెచ్ సీ నుండి కొంతమంది సిబ్బందిని పై స్థాయి అధికారుల ఆదేశాలతో తిరిగి జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చినప్పటి నుండి సదరు ఉన్నతాధికారి అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని యూనియన్ నాయకులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా అందరి ముందే..మీరు 4వ తరగతి ఉద్యోగులు అని కించ పరుస్తున్నారని బాధాప్తహృదయంతో ఆవేదన వెలిబుచ్చారు. తక్కువ సిబ్బంది తో ఎక్కువ పనిభారాన్ని మోపుతూ శ్రమదోపిడి చేస్తున్నారని అన్నారు. సదరు ఉన్నతాధికారి క్రింది స్థాయి ఉద్యోగుల పట్ల చులకన భావంతో మాట్లాడుతూ నేనే రాజు నేనే మంత్రి అంటూ నా ఇష్టం ఉన్నట్లు డ్యూటీ చేస్తాను అని.. నచ్చితే వస్తా లేకపోతే రాను నన్ను అడిగే వారు ఎవరు అని అంటున్నట్లు సమాచారం.

వ్యక్తిగత డ్రైవర్లు క్రింది స్థాయి సిబ్బందిపై అజమాయిషీ చేస్తూ.. చెప్పిన పని చేయకుంటే పై అధికారికి మీ పై కంప్లైయింట్ చేస్తానని బెదిరింపులకు గురిచేస్తున్నారనీ అన్నారు. వైద్యులు సమయపాలన పాటించకున్నా..వారిని ఏమీ అనకుండా క్రింది స్థాయి సిబ్బందిని మాత్రమే ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు.







గత నాలుగు నెలలుగా పనిచేస్తున్నప్పటికీ జీతాలు లేక కుటుంబ జీవనాన్ని పోషించలేక ఇబ్బందులు పడుతున్నామని జీతాల గురించి అడుగగా జీతాలు నా పరిధిలోనివి కావని అన్నారని తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులుగా పనిచేస్తున్న క్రింది స్థాయి ఉద్యోగులను గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రికి ఆదేశాలతో తీసుకువచ్చి ఎక్కువ సిబ్బంది తో చేసే పనిని తక్కువ సిబ్బంది తో చేపిస్తూ జీతాల పేరు ఎత్తగానే నాకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని, జీతాలు రాక కుటుంబాలు గడవక తీవ్ర మనస్థాపానికి గురవుతున్నామని అన్నారు. పని చేయాలని ఆదేశించే అధికారికి జీతాలు ఇప్పించే బాధ్యత లేదా అని సదరు ఉన్నతాధికారిని ప్రశ్నిస్తున్నారు.

క్రింది స్థాయి ఉద్యోగులమైన మాపై సదరు ఉన్నతాధికారి డ్రైవర్(లు) పెత్తనం చేస్తూ ఊడిగం చేపిస్తున్నారని... చెప్పిన పని చేయకుంటే...మీ సంగతి చూస్తాం అని బెదిరిస్తున్నారని వాపోయారు.

జిల్లా పెద్ద ఆసుపత్రిలో సూపరిండెంట్, ఏడీల మధ్య విభేదాల వల్ల క్రింది స్థాయి సిబ్బంది ఎవరి మాట వినాలో అవగతం కావడం లేదని, జీతాల గురించి అడుగగా సూపరిండెంట్ నాకు సంబంధం లేదని, ఏడి ని అడిగితే నాకు కూడా సంబంధం లేదంటూ సమాధానం ఇస్తున్నారని తెలిపారు. మా సమస్యల గూర్చి చెప్పడానికి వెళ్తే తప్పించుకుంటూ నానా ఇబ్బందులకు గురిచేస్తూ దుర్భాషలాడుతున్నారని తెలిపారు. ఈ సందర్భాన్ని ఏ డి అలుసుగా తీసుకొని మరో సూపరిండెంట్ గా అవతారమెత్తి క్రింది స్థాయి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని యూనియన్ నాయకులు తెలిపారు.

సిబ్బందిని ఒత్తిడితో పని చేయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో మనస్థాపం చెంది కుటుంబం కోసం పనిచేయాలా.. లేక చావాలా.. అన్నంతగా ఇబ్బంది పడుతున్నామని అన్నారు.ఇదిలా ఉండగా సదరు ఉన్నతాధికారి నాకిష్టం వచ్చినట్లు నేను డ్యూటీ చేస్తా...లేకపోతే చేయను..మంత్రయినా అయినా కలెక్టర్ అయిన ఎవరు చెప్పినా నేను పట్టించుకోను అనే విధంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం.

ఏదైనా సమస్య ఉంటే తనతో చెప్పాలని గతంలో చెప్పినప్పటికీ ఎన్ని సార్లు కాల్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయరని అన్నారు. 15 సంవత్సరాలుగా చాలీ చాలని జీతంతో పనిచేస్తున్నా...దుర్భషలాడుతూ, అవమానపరుస్తూ ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాకు తగిన న్యాయం చేయాలని క్రింది స్థాయి సిబ్బంది కోరుతున్నారు.



# నంబర్ 2 టీమ్ ఏదో తేలుతుందా?

పాకిస్థాన్, యూఏఈ, అఫ్గానిస్థాన్.. ఆసియా కప్ ముంగిట ట్రై సిరీస్ ఆడాయి. ఇందులో పాక్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో అఫ్గాన్‌ను పాక్ చిత్తు చేసింది. దీంతో ఆసియా కప్‌లో ఎలాగైనా పాక్‌ను ఓడించాలనే లక్ష్యంతో అఫ్గాన్ బరిలోకి దిగనుంది. మరోవైపు 'రెండో బెస్ట్' టీమ్‌గానూ తమను పరిగణించని వారికి తమ ఆటతీరుతోనే సమాధానం ఇవ్వాలని పాక్ చూస్తోంది. హాంగ్‌కాంగ్ - అఫ్గానిస్థాన్ (సెప్టెంబర్ 9) మ్యాచ్‌తో ఆసియా కప్ 2025 ఎడిషన్ ప్రారంభం కానుంది.

ఆ ప్రశ్నతో..

ట్రై సిరీస్ ప్రారంభానికి ముందు మూడు జట్ల సారథులు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓ విలేకరి.. పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా ముందే అఫ్గాన్ సారథి రషీద్‌కు ఓ ప్రశ్న సంధించాడు. 'ఆసియాలోనే రెండో అత్యుత్తమ జట్టు' అయిన మీరు మినీకప్‌కు ఎలా సన్నద్ధమయ్యారు? అని అడిగాడు. ఆ ప్రశ్నకు సల్మాన్ అఘా చాలా ఇబ్బందిపడ్డాడు. సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారిపోయింది. ప్రపంచ క్రికెట్‌లో పెద్ద జట్లతో సరిపోల్చే టీమ్ తమ దారుణ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే, ట్రై సిరీస్‌ను పాక్ నెగ్గినా.. ఇప్పటికీ అఫ్గాన్ నుంచి ముప్పు పొంచిఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నమాట. శ్రీలంక కూడా తామేం తక్కువ కాదని నిరూపించు కొనేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తుం దనడంలో సందేహం లేదు.

ఆ ఇద్దరూ లేకపోవడం వల్లనేనా?

సీనియర్ క్రికెటర్లు మహ్మద్ రిజ్వాన్, బాబర్ అజామ్ గత కొన్నేళ్లుగా పాక్ క్రికెట్‌లో కీలకపాత్ర పోషించారు. ఇటీవల వారిద్దరి ప్రభావం పెద్దగా లేకపోవడంతో జట్టులో స్థానం కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ ఇద్దరూ లేకపోవడంతో పాక్ కాస్త బలహీనంగానే కనిపిస్తోంది.

యూఏఈ, అఫ్గాన్‌పై ముక్కోణపు సిరీస్ నెగ్గిన ఉత్సాహంతో పాక్ ఆసియా కప్ బరిలోకి దిగనుంది. గ్రూప్ స్టేజ్‌లో భారత్‌తో మినహా మిగతా జట్ల నుంచి పెద్దగా ఇబ్బంది రాకపోవచ్చు. అయితే, సూపర్ 4లో మాత్రం అఫ్గాన్, శ్రీలంక వంటి గట్టి టీమ్‌లు ఎదురవుతాయి. ట్రై సిరీస్ ఓటమికి అఫ్గాన్ 'రివెంజ్' ప్లాన్ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

పెద్ద జట్లకు షాక్ తగులుద్దా?

టీ20ల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో అంచనా వేయడం చాలా కష్టం. గతంలోనూ పెద్ద జట్లకు షాక్ తగిలిన సందర్భాలూ ఉన్నాయి. ఈసారి కూడా అలాంటి ప్రమాదం లేకపోలేదు. భారత్, పాకిస్థాన్, యూఏఈతోపాటు ఒమన్ కూడా గ్రూప్‌స్టేజ్‌లో తలపడనుంది. తమను తక్కువగా అంచనా వేయొద్దని.. పెద్ద జట్లకు షాక్ ఇస్తామని ఇప్పటికే ఒమన్ ప్లేయర్ సుఫ్యాన్ మెహమూద్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఒకప్పుడు చిన్న జట్టుగా పిలవబడిన అఫ్గాన్ ఇప్పుడు అత్యుత్తమ ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. ఈ ఆసియా కప్‌లోనూ యూఏఈ, ఒమన్‌ను తక్కువగా అంచనా వేయొద్దని ఇప్పటికే క్రికెట్ విశ్లేషకులు సూచించారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. సంచలనం నమోదుకావడం ఖాయమే.

# మళ్లీ యుఎస్ ఓపెన్ కైవసం


## ఫైనల్లో అనిసిమోవాపై గెలుపు

గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఒకసారి ఫైనల్ చేరడమే కష్టం.. అలాంటిది ఒకే సీజన్లో రెండుసార్లు తుది పోరులో అడుగుపెట్టినా రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంటే? ఆ ప్లేయర్ మానసిక స్థితి ఎలా ఉంటుంది? అలాంటి స్థితిలోనే యుఎస్ ఓపెన్ ఫైనల్ ఆడిన అర్యానా సబలెంకా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంది. కానీ ఈసారి ఆమె లొంగలేదు. కప్ గెలిచేదాకా వదల్లేదు. స్థానిక క్రీడాకారిణి అనిసిమోవా పోరాడినప్పటికీ.. పట్టు వదలని సబలెంకా, ఫ్లషింగ్ మెడోస్‌లో టైటిల్‌ను నిలబెట్టుకుంది.

న్యూయార్క్

డిఫెండింగ్ ఛాంపియన్ సబలెంకా అదరగొట్టింది. ఫామ్ కొనసాగిస్తూ.. ప్రస్తుత మహిళల టెన్నిస్‌లో హార్డ్ కోర్టులో తన ప్రత్యేకతను నిరూపించుకుంటూ.. మరోసారి యుఎస్ ఓపెన్ ఛాంపియన్ అయింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సబలెంకా (బెలారస్) 6-3, 7-6 (7-3)తో ఎనిమిదో సీడ్ అనిసిమోవా (అమెరికా)ను ఓడించింది. మ్యాచ్‌లో ఆధిపత్యం సబలెంకాదే అయినా.. అనిసిమోవా తన పోరాటంతో ఆకట్టుకుంది. ముఖ్యంగా రెండో సెట్లో సబలెంకాను బాగా ఇబ్బందిపెట్టింది. అయినా ఒత్తిడిని తట్టుకుని సబలెంకా నిలిచింది. తొలి సెట్లో బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో సబలెంకా.. మెరుపు క్రాస్ కోర్టు విన్నర్లతో అనిసిమోవా విజృంభించడంతో మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. తొలి నాలుగు గేమ్‌లలోనే ఒకరి సర్వీసులు ఒకరు బ్రేక్ చేసుకున్నారు. అయితే ఎనిమిదో గేమ్‌లో మరో బ్రేక్ సాధించిన సబలెంకా 5-3తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరుతో సెట్ గెలిచింది. రెండో సెట్లో సబలెంకా మరింత దూకుడుగా.. ఆత్మవిశ్వాసంతో ఆడింది. బలమైన సర్వీసులతో ప్రత్యర్థికి పరీక్ష పెట్టింది. 3-1తో ఆధిక్యంలో నిలవడంతో సబలెంకా తేలిగ్గా రెండో సెట్, మ్యాచ్ గెలుస్తుందేమో అనిపించింది.

అనిసిమోవా పోరాటం: ఓటమికి చేరువలో ఉన్న స్థితిలో అనిసిమోవా గొప్పగా పోరాడింది. సబలెంకా 5-4తో ఛాంపియన్‌షిప్ కోసం సర్వీస్ చేస్తున్న దశలో ఈ అమెరికా అమ్మాయి బ్రేక్ సాధించింది. రిటర్న్ చేసే క్రమంలో సబలెంకా ఓ షాట్‌ను నెట్‌కు కొట్టడంతో అనిసిమోవా 5-5తో స్కోరు సమం చేసింది. అదే జోరుతో సెట్‌ను టైబ్రేకర్‌కు మళ్లించింది. మ్యాచ్ మలుపు తిరుగుతుందేమో అనిపించిన సందర్భమిది. తానాడిన గత రెండు ఫైనల్స్‌లో ఒత్తిడికి చిత్తయిన సబలెంకా ఈసారి ఆ పరిస్థితి రానీయలేదు. తప్పులకు తావీయకుండా ప్రత్యర్థిపై తన ఒత్తిడిని మళ్లించిన సబలెంకా.. టైబ్రేకర్‌లో పైచేయి సాధించింది. మెరుపు సర్వీసులతో విజృంభించిన ఆమె.. సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. తన సర్వీస్‌లో అనిసిమోవా షాట్‌ను కోర్టు బయటకు కొట్టడంతో సబలెంకా సంబరాల్లో మునిగిపోయింది. మ్యాచ్‌లో ఒక ఏస్, 13 విన్నర్లు కొట్టిన ఆమె.. అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది. 29 అనవసర తప్పిదాలు, 7 డబుల్‌ఫాల్ట్స్ చేసిన అనిసిమోవా మూల్యం చెల్లించుకుంది. మరోవైపు పురుషుల డబుల్స్ టైటిల్‌ను గ్రానోలర్స్ (స్పెయిన్)-జెబాలాస్ (అర్జెంటీనా) జంట గెలుచుకుంది. ఫైనల్లో గ్రానోలర్స్ ద్వయం 3-6, 7-6 (7-4), 7-5తో సాలిస్‌బరి-స్కూప్‌స్కీ (బ్రిటన్) జంటను ఓడించింది.



4 సబలెంకా సాధించిన గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు. ఆస్ట్రేలియన్ ఓపెన్ (2023, 24), యుఎస్ ఓపెన్ (2024, 2025)లో రెండేసి టైటిళ్లు గెలిచింది.

# జ్యోతి జోడీకి రజతమే

గ్వాంజు (దక్షిణ కొరియా) ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంపై గురి పెట్టిన తెలుగమ్మాయి జ్యోతి సురేఖకు నిరాశ ఎదురైంది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో రిషబ్ యాదవ్‌తో కలిసి పోటీ పడ్డ ఆమె.. రజతంతో సరిపెట్టుకుంది. ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో సురేఖ, రిషబ్ యాదవ్ జోడీ 155-157 (39-38, 37-39, 40-40, 39-40)తో నెదర్లాండ్స్‌కు చెందిన మైక్ స్కోల్‌సెర్, సేన్ డి లాట్ జంట చేతిలో పరాజయంపాలైంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో సురేఖకు ఇది తొమ్మిదో పతకం కావడం విశేషం. ఈ టోర్నీలో అత్యధిక పతకాలు సాధించిన భారత ఆర్చర్ ఆమెనే. ఇంతకుముందు వ్యక్తిగత విభాగంలో ఒక రజతం, రెండు కాంస్యాలు గెలిచిన ఆమె.. టీమ్ విభాగంలో ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్యం సొంతం చేసుకుంది.

రిషబ్ అక్కడ సాధించాడు: మరోవైపు భారత పురుషుల కాంపౌండ్ జట్టు చారిత్రక విజయం సాధించింది. ఈ టోర్నీలో తొలిసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. జ్యోతితో కలిసి రజతం గెలిచిన రిషబ్ యాదవ్.. అమన్ సైని, ప్రథమేశ్‌లతో కలిసి పసిడి సొంతం చేసుకున్నాడు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత బృందం 235-233 (57-59, 60-58, 59-59, 59-57)తో ఫ్రాన్స్ జట్టును ఓడించింది. తొలి సెట్ ముగిసే సరికి 57-59తో వెనుకబడ్డ భారత్.. ఆరు పదులతో రెండో సెట్లో పుంజుకుంది. స్కోరును 117-117తో స్కోరు సమం చేసింది. రెండు జట్లు మూడో సెట్లో చెరో 59 పాయింట్లు సాధించడంతో స్కోరు 176-176తో సమమైంది. ఆఖరి సెట్లో ఫ్రాన్స్ జట్టు ఒత్తిడికి గురైంది. భారత జట్టు మాత్రం ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వలేదు.

# భవిష్యత్తు నాయకుడా.. అంతా 'శుభ'మే



ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఎనిమిదేళ్లకే జాతీయ జట్టు సారథ్యం చేపట్టడం సాధారణ విషయం కాదు. అద్భుత ప్రదర్శనతో ఆ స్థాయికి చేరిన క్రికెటర్ శుభ్‌మన్ గిల్. ఇవాళ అతడి బర్త్‌డే. ఇప్పటికే టెస్టు కెప్టెన్సీ చేపట్టిన అతడిని.. భవిష్యత్తులో టీమ్‌ఇండియాకు ఏకైక సారథిగా చూస్తామనడంలో సందేహం లేదు.

2017లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోకి అడుగు.. తొలి మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ. తర్వాత పోరులో ఏకంగా సెంచరీ. ఆ ప్రతిభే అండర్ -19 టీమ్‌లోకి ఎంట్రీ ఇచ్చేలా చేసింది. 2018 వరల్డ్ కప్ వైస్ కెప్టెన్‌గానూ బాధ్యతలు చేపట్టాడు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. పాక్‌పై సూపర్‌సెంచరీతో అందరి మన్ననలు అందుకొన్నాడు. నెట్ ప్రాక్టీస్‌లోనే మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రిని ఆకట్టుకున్న శుభ్‌మన్ గిల్ టీమ్‌ఇండియాకు డెబ్యూ చేశాడు. 2019లో వన్డేల్లోకి అడుగుపెట్టిన అతడు రోహిత్, - విరాట్ జోడీ ఉన్నా సరే.. తనకొచ్చిన ఛాన్స్‌లను మాత్రం పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. కెరీర్‌లో ఇప్పటివరకూ 55 వన్డేల్లో 2,775 పరుగులు, 37 టెస్టుల్లో 2,674 పరుగులు, 21 టీ20ల్లో 578 పరుగులు చేశాడు. సీనియర్లను కాదని..

విరాట్ కోహ్లీ తర్వాత రోహిత్ శర్మ సారథ్యం చేపట్టాడు. వీరిద్దరూ టెస్టులతోపాటు టీ20లకు వీడ్కోలు పలికారు. ఆ వెంటనే సూర్యకుమార్ యాదవ్‌కు పొట్టి ఫార్మాట్ కెప్టెన్సీ అప్పగించడం జరిగింది. అతడు టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించడం లేదు. ఇక స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కూడా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే పరిమితమైపోయాడు.

దీంతో రోహిత్ స్థానంలో టెస్టు జట్టు పగ్గాలు ఎవరికి ఇస్తారనేది ఆసక్తికకరంగా మారింది. సీనియర్లు జస్‌ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్ ఈ రేసులో ముందంజలో నిలిచారు. యువ క్రికెటర్లూ యశస్వి జైస్వాల్ నుంచీ పోటీ తప్పలేదు. చివరికి శుభ్‌మన్ గిల్‌నే కెప్టెన్సీ వరించింది.

ఇప్పటికే వన్డే, టీ20లకు డిప్యూటీగా మారిన గిల్.. భవిష్యత్తులోనూ మూడు ఫార్మాట్లకూ సారథ్యం చేపట్టడం ఖాయమనే వాదనా క్రికెట్ అభిమానుల్లో ఉంది. వచ్చే పుట్టినరోజులోగా భారత జట్టు పరిపూర్ణ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను చూసే అవకాశాలే ఎక్కువ.

నేను సింగిల్‌నే..

వ్యక్తిగత జీవితం గురించి ఎక్కువగా బయట ప్రస్తావించడు. ప్రైవసీని కోరుకునే గిల్ ఇప్పటికీ తాను సింగిల్‌నేనని చెబుతాడు. ఆ మధ్య అతడికి, సచిన్ కుమార్తె సారా తెందూల్కర్‌ల మధ్య ప్రేమ వ్యవహారం ఉందనే వార్తలూ వచ్చాయి. కానీ, వాటిని కొట్టిపడేసేలా.. తన ట్రావెల్ షెడ్యూల్ చాలా బిజీగా ఉంటుందని, రిలేషన్‌షిప్‌లకు కేటాయించేంత సమయం తనకు లేదని చెప్పకనే చెప్పాడు. తన దృష్టంతా ప్రస్తుతం క్రికెట్ పైనే ఉందని అతడి మాటలను బట్టి స్పష్టమవుతోంది. తన చిన్ననాటి స్నేహితుడు అభిషేక్ శర్మతో కలిసి తిరిగేందుకు ఇష్టపడతాడు. అలాగే కుటుంబసభ్యులతో టూర్లూ వేస్తుంటాడు.

# ఆసియా కప్.. ఇదిగో వీరే హాట్ టాపిక్



ఆసియా కప్ 2025 టోర్నీకి వేళైంది. మంగళవారం నుంచి 'మినీ కప్' సంబరం మొదలుకానుంది. ఇప్పటికే ప్లేయర్లంతా సిద్ధం. ఎనిమిది జట్లు తలపడే ఈ టోర్నీలో ప్రతి క్రికెటరూ కీలకమే. కానీ, ప్రతి టీమ్‌లోనూ కనీసం ఒక్క ప్లేయరైనా ప్రభావం చూపించడం లేదా ఇదిగో ఇతడిపై ఓ కన్నేయాలి అనేంతస్థాయి ఆటతీరు ప్రదర్శించిన వారూ లేకపోలేదు.

డిప్యూటీగా వచ్చిన గిల్

భారత జట్టులో ఇప్పుడందరి దృష్టి శుభ్‌మన్ గిల్ పైనే. అంతకుముందు వరకూ కెప్టెన్ సూర్యకుమార్‌కు డిప్యూటీగా ఉన్న అక్షర్ పటేల్‌ను మేనేజ్‌మెంట్ తొలగించింది. హార్దిక్ పాండ్యనూ కాదని.. భవిష్యత్తు సారథ్యం వైపు చూస్తోన్న టీమ్‌ఇండియా గిల్‌కు వైస్ కెప్టెన్సీ అప్పగించింది. చివరిసారిగా గతేడాది జులైలో టీ20 మ్యాచ్ ఆడిన అతడు.. ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరమే. ఇటీవల టెస్టు సారథ్యం చేపట్టి ఇంగ్లాండ్ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అద్భుత ఫామ్‌తో జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్నాడు.

సీనియర్ ప్లేయర్‌గా ముస్తాఫిజుర్

బంగ్లాదేశ్ జట్టులో సీనియర్ ప్లేయర్ ముస్తాఫిజుర్ రహ్మాన్. ఈ 30 ఏళ్ల ఆటగాడు ఇప్పటివరకు 113 టీ20లు ఆడాడు. ఎడమ చేతివాటం పేసర్ అయిన రహ్మాన్ ) మరోసారి తమ బౌలింగ్ దాడిని నడిపిం చేందుకు సిద్ధమయ్యాడు. స్లో బంతులతో ప్రత్యర్థులను చికాకు పెట్టించే రహ్మాన్.. పదునైన పేస్‌తోనూ ఇబ్బందులు సృష్టించగలడు. ఆసియా కప్ లో జస్‌ప్రీత్ బుమ్రా, షహీన్ అఫ్రిది తర్వాత ఆ స్థాయిలో అద్భుతంగా పేస్ బౌలింగ్ వేసే బౌలర్ ముస్తాఫిజుర్. తన నాలుగు ఓవర్ల కోటాలో మ్యాజిక్ చేయగల సమర్థుడు. ఇప్పటివరకు టీ20ల్లో 142 వికెట్లు తీసిన అతడిని ఎదుర్కోవడంలో బ్యాటర్లు జాగ్రత్తగా ఉండాల్సిందే.

ఆ దేశ టాప్ వికెట్ టేకర్..

ఏదైనా జట్టుకు ఆల్‌రౌండర్లే బలం. ఇక సారథిగా అలాంటి ప్లేయరే ఉంటే.. అదనంగా మరొక బౌలర్ లేదా బ్యాటర్‌ను తీసుకొనే వెసులుబాటు ఉంటుంది. ఇప్పుడు హాంకాంగ్ జట్టు పరిస్థితి కూడా ఇదే. ఆ టీమ్ సారథి యాసిమ్ ముర్తాజా ఇటు స్పిన్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపిస్తాడు. ఇక ఆ జట్టులో మరో తురుపు ముక్క ఎహ్సాన్ ఖాన్. 94 మ్యాచుల్లో 127 వికెట్లు తీసిన ఈ ఆఫ్ స్పిన్నర్ ఆ దేశం తరఫున టాప్ వికెట్ టేకర్. అతడి ఎకానమీ (6.26) కూడా చాలా పొదుపుగానే ఉంది.

అర్హత ఉన్నా చోటు దక్కకపోతే..: శ్రేయస్ అయ్యర్ కీలక వ్యాఖ్యలు



తాజా హ్యాట్రిక్‌తో..

పాకిస్థాన్ టీమ్ ఈసారి భారీగానే స్పిన్నర్లను రంగంలోకి దించింది. యూఏఈ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలమనే విషయం అందరికీ తెలిసిందే. తాజాగా పాకిస్థాన్ (ముక్కోణపు టీ20 సిరీస్ విజేతగా నిలిచింది. యూఏఈ, అఫ్గానిస్థాన్‌తో ట్రై సిరీస్ ఆడిన పాక్‌కు మంచి ప్రాక్టీస్ అయింది. ఫైనల్‌లో అఫ్గాన్‌పై హ్యాట్రిక్ తీసిన మహ్మద్ నవాజ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాడు. పాక్ తరఫున టీ20ల్లో హ్యాట్రిక్ తీసిన తొలి స్పిన్నర్‌గా నిలిచాడు. స్పిన్‌కు బాగా అనుకూలించే దుబాయ్ పిచ్‌పై నవాజ్‌ను కాచుకుంటే టీమ్‌ఇండియాకు తిరుగుండదు.

కేవలం నాలుగే టీ20లు..

ముత్తయ్య మురళీధరన్, అజంతా మెండిస్, తీక్షణ.. వంటి మిస్టరీ స్పిన్నర్లను తయారుచేసిన శ్రీలంక జట్టుకు మరో స్పిన్నర్ దొరికాడు. కేవలం నాలుగు అంతర్జాతీయ టీ20లను మాత్రమే ఆడిన దునిత్ వెల్లలాగేను శ్రీలంక తన స్క్వాడ్‌లోకి తీసుకుంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అయిన అతడు బ్యాటింగ్‌లోనూ ఓ చేయి వేయగలడు. నాలుగు మ్యాచుల్లో ఆరు వికెట్లు తీసిన వెల్లలాగె ఇప్పుడు లంక టీమ్‌లో ఫేవరెట్ బౌలర్. ఓవైపు తీక్షణ, పతిరన ఉన్నప్పటికీ.. ఇప్పటికే వారి బౌలింగ్‌ను ప్రత్యర్థులు ఎదుర్కొన్న సందర్భాలు ఎక్కువే. అందుకే, దునిత్ ఇప్పుడు స్పెషల్ బౌలర్. ఆసియా కప్ బరిలోకి దిగిన ప్లేయర్లకు అతడి బౌలింగ్ పెద్దగా పరిచయం లేదు.

రోహిత్‌ను వెనక్కి నెట్టిన కెప్టెన్

కేవలం నాలుగేళ్ల వ్యవధిలో 180 సిక్స్‌లు కొట్టడం మామూలు విషయం కాదు. అదీనూ 82 మ్యాచుల్లో కావడం గమనార్హం. ఇక కెప్టెన్‌గానూ అత్యధిక సిక్స్‌ల రికార్డూ అతడి సొంతం. ఇదంతా యూఏఈ సారథి మహ్మద్ వసీమ్ గురించే. బ్యాటర్‌గా రోహిత్ (205) తర్వాత ఎక్కువ సిక్స్‌లు కొట్టిన వసీమ్.. కెప్టెన్‌గా మాత్రం మన హిట్‌మ్యాన్‌నే అధిగమించాడు. రోహిత్ 105 కొడితే.. వసీమ్ 110 సిక్స్‌లు దంచాడు. ఇప్పుడు ఆసియా కప్‌లోనూ యూఏఈ)ని నడిపించేందుకు సిద్ధమయ్యాడు. భారత్ తన తొలి మ్యాచ్‌ను యూఏఈతోనే ఆడనుండటం గమనార్హం.

ఓపెనింగే కీలకం.. అతడి ఆర్డర్ మారిస్తేనే బెటర్: మాజీ క్రికెటర్

మనోడు అక్కడ సారథి..

యువకుడిగా ఉన్నప్పుడే ఒమన్ వెళ్లిన లూథియానా కుర్రాడు జతిందర్ సింగ్ ఇప్పుడు ఏకంగా సారథి అయిపోయాడు. తొలిసారి ఆసియా కప్ బరిలోకి దిగిన ఒమన్‌ను నడిపించేందుకు సిద్ధమయ్యాడు. భారత్, పాకిస్థాన్, యూఏఈతో కూడిన గ్రూప్‌లోనే ఒమన్ కూడా ఉంది. ఇప్పటికే రెండు టీ20 ప్రపంచకప్‌ల్లో ఆడిన అతడు 1,300కి పైగా పరుగులు చేశాడు. సెప్టెంబర్ 12న పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో ఒమన్ తలపడనుంది.

ఇప్పటికీ సులువేం కాదు..

ప్రపంచ టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ రషీద్ ఖాన్. తన కెరీర్‌లో 170 వికెట్లు పడగొట్టిన అతడు ఇప్పటికీ అదే జోష్‌తో బౌలింగ్ చేస్తాడు. ఈసారి సారథిగానూ బాధ్యతలు తీసుకున్న రషీద్ ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది ఆసక్తికరమే. తన నాలుగు ఓవర్ల కోటాలో తప్పకుండా ప్రభావం చూపించే రషీద్ బ్యాటింగ్‌లోనూ హిట్టింగ్ చేయగలడని ఇప్పటికే నిరూపితమైంది. గత ఐపీఎల్ (%×ూా%)లో అలాంటి ప్రదర్శనలు ఎన్నో తన బ్యాట్ నుంచి వచ్చాయి. ఇప్పుడు ముక్కోణపు సిరీస్‌లో ఆడటమూ అతడికి కలిసి రానుంది. నాలుగు మ్యాచుల్లో తొమ్మిది వికెట్లు తీసిన రషీద్‌ను ఇప్పుడు ఎదుర్కోవడం ప్రత్యర్థులకు సవాల్.

# సంక్రాంతికి పక్కా...


రవితేజ

కథానాయకుడు రవితేజ.. దర్శకుడు కిశోర్ తిరుమల కలయికలో ఓ చిత్రం రూపొందుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సంక్రాంతి లక్ష్యంగా చిత్రీకరణ ప్రారంభించుకున్న ఈ సినిమా ఇటీవల జరిగిన కార్మికుల సమ్మె వల్ల వాయిదా పడనున్నట్లు ప్రచారం వినిపించింది. కానీ, చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం ప్రకారం ఇది ముగ్గుల పండగ బరిలో నిలవడం పక్కా అని తెలిసింది. దీనికోసం వచ్చే ఏడాది జనవరి 13వ తేదీని లాక్ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ చిత్ర షూటింగ్ అక్టోబరు చివరి నాటికి పూర్తి కానుంది. త్వరలోనే టైటిల్ ప్రకటించి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. వినోదంతో నిండిన ఈ కుటుంబ కథా చిత్రానికి 'అనార్కలి' అనే పేరు పరిశీలనలో ఉంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తుండగా.. ప్రసాద్ మూరెళ్ల ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇక ప్రస్తుతం రవితేజ నటించిన 'మాస్ జాతర' నిర్మాణానంతర పనుల్లో ఉండగా.. అక్టోబరు లేదా నవంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.

# 46 ఏళ్ల తర్వాత కమల్, రజనీ మల్టీస్టారర్




: కోట్ల మంది సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న మల్టీస్టారర్ అధికారికమైంది. ఇండస్ట్రీలో అగ్ర కథానాయకుల్లో ముందు వరుసలో ఉండే కమల్‌హాసన్, రజనీకాంత్‌లు ఇప్పుడు 46 ఏళ్ల తర్వాత కలిసి స్క్రీన్‌పై కనిపించనున్నారు. వీరిద్దరి కాంబోలో మల్టీస్టారర్ రానుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాను కమల్‌హాసన్ అధికారికంగా ప్రకటించారు. దీంతో వీరి అభిమానులు సంబరపడుతున్నారు.

ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్‌హాసన్) బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. 'మీరు, రజనీకాంత్ కాంబినేషన్‌లో ఓ సినిమాను ఆశించవచ్చా' అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. "ప్రేక్షకులు మా కాంబినేషన్‌ను ఇష్టపడితే మంచిదే కదా.. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసి రానున్నాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది" అని స్పష్టంచేశారు. దీంతో ఈ బిగ్ మల్టీస్టారర్ అధికారికమైంది అయితే, ఈ ప్రాజెక్ట్ వివరాలు మాత్రం ఆయన పంచుకోలేదు.

ఇక వీరిద్దరి మధ్య అభిప్రాయబేధాలు ఉన్నాయంటూ వస్తోన్న వార్తలపై కూడా కమల్ స్పందించారు. "మా మధ్య ఎలాంటి భేదాలు లేవు. ఇవన్నీ మీరు సృష్టించుకున్నవే. మేం ఎప్పుడూ ఒకరికి ఒకరం పోటీ అనుకోలేదు. మేమిద్దరం కలిసి నటించేందుకు అవకాశం కోసం ఎదురుచూశాం. ఒకరి సినిమాలు మరొకరం నిర్మించాలని కూడా ప్రయత్నం చేశాం" అని కమల్ హాసన్ తెలిపారు.

లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వీరిద్దరి మల్టీస్టారర్ రానున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. లోకేశ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఓ సినిమాని తెరకెక్కించనున్నారని, రజనీ - కమల్ ఇద్దరూ గ్యాంగ్‌స్టర్లుగానే సందడి చేయనున్నారని కోలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. ఇదే నిజమైతే 46 ఏళ్ల తర్వాత రజనీ- కమల్ మళ్లీ కలిసి కెమెరా ముందుకువచ్చినట్టవుతుంది. ఈ ఇద్దరూ కలిసి 5 భాషల్లో 20కి పైగా సినిమాలు చేశారు. అయితే అదంతా 1970వ దశకంలోనే. ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ తెరను పంచుకొనే అవకాశం రాలేదు. ఇన్నేళ్లకు లోకేశ్ రాసిన కథలో వీరు సందడి చేయనున్నట్లు తెలుస్తోంది.

## రెండు మర్డర్లు చేసిన ఖైదీ.. నాకు గడ్డం చేశాడు: సంజయ్‌దత్



తాజాగా సంజయ్‌దత్ ది గ్రేట్ ఇండియన్ కపిల్ శర్మ షోలో సునీల్ శెట్టితో (కలిసి సందడి చేశారు. ఆ కార్యక్రమంలో ) తాను జైలులో గడిపిన రోజులను గుర్తుచేసుకున్నారు. అక్కడ ఎదురైన కొన్ని ఆసక్తికర అనుభవాలను పంచుకున్నారు. జైలు సూపరింటెండెంట్‌ను ఒకసారి తాను గడ్డం తీయించమని అడిగానని.. ఆయన మిశ్రా అనే ఖైదీని నియమించినట్లు తెలిపారు. మిశ్రాతో జరిగిన సంభాషణను తెలిపారు.

"ఎంతకాలం నుంచి జైలులో ఉంటున్నావని మిశ్రాను అడిగాను. అతడు ఏకంగా 15 ఏళ్ల నుంచి ఉంటున్నట్లు తెలిపాడు. ఏం నేరం చేశావని అడిగాను. 'రెండు మర్డర్లు చేశాను' అని బదులిచ్చాడు. ఆ సమయంలో అతడు రేజర్‌ను నా మెడకు దగ్గర్లో ఉంచాడు. ఒక్కసారిగా అతడి చేయి పట్టుకున్నా. మా ఇద్దరి మధ్య ఒక సాదాసీదా సంభాషణతో ఆ రోజు గడిచింది. జైలులో నేను కుర్చీలు, కాగితపు సంచులు తయారుచేశాను. దానికి జీతం కూడా వచ్చింది. అలాగే ఓ రేడియో స్టేషన్‌ను ప్రారంభించాను. అది జైలు లోపల మాత్రమే ప్రసారమయ్యేది. దానికి కూడా డబ్బులు ఇచ్చేవారు. ఖైదీలు అందరితో కలిసి కామెడీ చేసేవాడిని. కొందరు స్క్రిప్ట్ రాసేవారు. అక్కడ గ్రూప్‌ను కూడా తయారుచేశాను. దానికి నేను డైరెక్టర్‌ని, ఖైదీలు యాక్టర్లుగా ఉండేవారు" అని సంజయ్ పంచుకున్నారు.

తన జీవితంలో జరిగిన ఏ విషయానికీ బాధ పడడం లేదని సంజయ్ తెలిపారు. కానీ, తన తల్లిదండ్రులు తనను విడిచి త్వరగా వెళ్లిపోయారనే బాధ మాత్రం ఎప్పటికీ ఉంటుందన్నారు. నేటికి కూడా వాళ్లను మిస్ అవుతున్నట్లు చెప్పారు. 1993లో ముంబయి పేలుళ్లకు సంబంధించిన ఆయుధాల కేసులో సంజయ్ జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. 2013 నుంచి 2016 వరకూ ఆయన జైలులోనే ఉన్నారు. అతడి జైలు జీవితంపై రాజ్‌కుమార్ హిరాణీ 'సంజు' అనే చిత్రాన్ని కూడా రూపొందించారు.

## ఏఆర్ రెహమాన్ కోసం రూ.70 లక్షలు వదులుకొన్న శ్రీదేవి



: దివంగత నటి శ్రీదేవి చివరి రోజుల్లో నటించిన చిత్రం 'మామ్'. రవి ఉద్యవర్ దర్శకత్వంలో బోనీ కపూర్ నిర్మాతగా చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. ఈ చిత్రం షూటింగ్ రోజులను తాజాగా బోనీ కపూర్ ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. 'మామ్' కోసం శ్రీదేవి ఎంతో కష్టపడినట్లు చెప్పారు.'శ్రీదేవి బాలీవుడ్‌కు వచ్చినప్పుడు ఆమెకు హిందీ మాట్లాడడం తెలియదు. మొదటి ఆరు సినిమాలకు వేరే వాళ్లు డబ్బింగ్ చెప్పారు. ఆ తర్వాత ఆమె స్వయంగా డబ్బింగ్ థియేటర్‌లో హిందీ పాఠాలు నేర్చుకొని తన సినిమాలకు సొంతంగా డబ్బింగ్ చెప్పడం ప్రారంభించింది. తన చివరి చిత్రం 'మామ్'లో ఎంతో అంకితభావంతో నటించింది. ఈ సినిమాకు తెలుగు, తమిళ, హిందీ వెర్షన్‌లకు స్వయంగా ఆమె డబ్బింగ్ చెప్పింది. మలయాళం పనులను దగ్గరుండి చూసుకుంది. అలాంటి నిబద్ధత చాలా తక్కువమంది ఆర్టిస్టులకు ఉంటుంది" అని బోనీకపూర్ ప్రశంసించారు.మామ్ కోసం శ్రీదేవి రెమ్యునరేషన్‌లో కొంతభాగం వదులుకున్నట్లు ఆయన వెల్లడించారు. "ఈ సినిమా కోసం ఏఆర్ రెహమాన్‌ను తీసుకోవాలని అనుకున్నాం. అయితే, ఇండస్ట్రీలో ఉన్న ఖరీదైన సంగీత దర్శకుల్లో ఆయన ఒకరు కావడంతో మేం ఆలోచనలో పడ్డాం. అప్పుడు శ్రీదేవి తన రెమ్యునరేషన్‌లో రూ.70 లక్షలు ఆయనకు ఇవ్వాలని చెప్పింది. దీంతో మా పని సులువైంది" అని చెప్పారు. ఇక 'మామ్' సినిమా షూటింగ్ సమయంలో శ్రీదేవి తనతో రూమ్ పంచుకోవడానికి కూడా నిరాకరించిందని బోనీ కపూర్ ) తెలిపారు.

## 'ఓజీ' కోసం 117 మంది సంగీత కళాకారులు..



పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రాల్లో 'ఓజీ' ఒకటి. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈనేప థ్యంలో కొన్ని రోజులుగా వరుస అప్‌డేట్‌లు, పోస్టర్లతో సోషల్ మీడియాలో చిత్ర బృందం సందడి చేస్తోంది. తాజాగా తమన్ ఓ మ్యూజికల్ అప్‌డేట్ పంచు కున్నారు.

ఇప్పటికే ఈ సినిమా కోసం జపాన్ వాయిద్య పరికరం కోటోను ఉపయోగించి బీజీఎం క్రియేట్ చేసినట్లు తెలిపిన ఆయన తాజాగా మరో పోస్ట్‌తో ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. లండన్‌లోని స్టూడియోలో దీని రికార్డింగ్ పనులు జరుగుతున్నట్లు తమన్ తెలిపారు. 117 మంది సంగీత కళాకారులు దీనికోసం వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. నేపథ్య సంగీతం అద్భుతంగా వచ్చిందన్నారు . తమన్ పోస్ట్‌తో హ్యాష్ ట్యాగ్ మరోసారి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది.

సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటివరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హాష్మీ విలన్. శ్రియారెడ్డి, ప్రకాశ్‌రాజ్, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.


శివ కార్తికేయన్ | సాయిపల్లవి, ఖుష్బూ

## ఉత్తమ నటి సాయిపల్లవి.. ఉత్తమ నటుడు శివ కార్తికేయన్

### 'సైమా 2025'లో 'అమరన్' మెరుపులు

'అమరన్' సినిమా 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ 2025' (సైమా 2025)లో పురస్కారాల పంట పండించింది. కోలీవుడ్ ఉత్తమ చిత్రంగా నిలిచిన ఈ సినిమాతో ఉత్తమ నటుడిగా శివ కార్తికేయన్, ఉత్తమ నటిగా సాయి పల్లవి, ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి, ఉత్తమ సంగీత దర్శకుడిగా జీవీ ప్రకాశ్ కుమార్ పురస్కారాలు దక్కించుకున్నారు. దుబాయ్‌లో శనివారం అట్టహాసంగా జరిగిన ఈ సైమా వేడుకలో తమిళ, మలయాళ సినిమాలకు అవార్డులు ప్రదానం చేశారు. తమిళ చిత్రాలకు సంబంధించిన క్రిటిక్స్ విభాగంలో 'సత్యం సుందరం' సినిమాకి గానూ కార్తి ఉత్తమ నటుడిగా పురస్కారం గెలుచుకున్నారు. చిత్ర పరిశ్రమకు సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్నందుకు శివ కుమార్‌ను, 25ఏళ్ల సినీ ప్రయాణం పూర్తి చేసుకున్నందుకు త్రిషను ప్రత్యేక అవార్డులతో సత్కరించారు. ఇక ఈ 13వ సైమా వేడుకల్లో మలయాళ చిత్రసీమ నుంచి 'ఆడు జీవితం' చిత్రానికి గానూ ఉత్తమ నటుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్, ఉత్తమ దర్శకుడిగా బ్లెస్సీ పురస్కారాలు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమల్‌హాసన్, ఖుష్బూ, శ్రుతిహాసన్, మీనా, సుహాసిని తదితరులు సందడి చేశారు.

# ఏపీలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ... టీటీడీకి కొత్త ఈవో

* రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ లకు స్థానచలనం
* టీటీడీ నూతన ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్ నియామకం
* ప్రస్తుత ఈవో శ్యామలరావు జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ
* రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబు
* పనితీరు ఆధారంగా బదిలీలు చేపట్టిన ప్రభుత్వం
* పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగింత

**అమరావతి, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన యంత్రాంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా సీనియర్ అధికారి అనిల్ కుమార్ సింఘాల్‌ను నియమించారు. ప్రస్తుతం టీటీడీ ఈవోగా పనిచేస్తున్న శ్యామలరావును సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబును నియమించారు. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ముఖేశ్ కుమార్ మీనా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్, అటవీ పర్యావరణ శాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండే బాధ్యతలు చేపట్టనున్నారు. ఇతర ముఖ్య నియామకాల్లో భాగంగా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనంతరామ్‌ను,




కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సౌరభ్ గౌర్‌ను ప్రభుత్వం నియమించింది. ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్, పరిశ్రమలు, కార్మిక శాఖ కమిషనర్‌గా శేషగిరిబాబును నియమించారు. ఎండోమెంట్ రెవెన్యూ కార్యదర్శిగా హరి జవహర్‌లాల్‌కు బాధ్యతలు అప్పగించారు. గత కొద్ది రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఏఎస్ అధికారుల పనితీరుపై సమీక్షలు జరిపారు. పరిపాలనలో వేగం పెంచేందుకు, అధికారుల పనితీరును మెరుగుపరిచేందుకు ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. పనితీరును ప్రామాణికంగా తీసుకుని, సమర్థులైన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించాలనే లక్ష్యంతో ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించిన అధిష్ఠానం

* ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 8 మంది రాష్ట్ర ఉపాధ్యక్షులతో కమిటీ ఏర్పాటు
* రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గౌతంరావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్
* ఉపాధ్యక్షులుగా బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి):** బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఎనిమిది మంది రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉంటారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గౌతంరావు, తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్‌లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, బండారి శాంతి కుమార్, కొల్లి మాధవి, జయశ్రీ, బండా కార్తీక్ రెడ్డి, రఘునాథ్ రావు, కల్యాణ్ నాయక్‌లను నియమించినట్లు ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, వివిధ మోర్చాలకు రాష్ట్ర అధ్యక్షులను కూడా నియమించారు.

## మూసీ ప్రక్షాళన ద్వారా హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి):** "మూసీ ప్రక్షాళన ద్వారా హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమవడంతో పాటు, నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య కూడా తీరుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమంలో భాగంగా ఉస్మాన్ సాగర్ వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగర దాహార్తిని తీర్చడానికే గోదావరి తాగునీటి పథకాన్ని తీసుకువచ్చామని తెలిపారు. వరద నియంత్రణ కోసమే ఉస్మాన్ సాగర్, హిమయత్ సాగర్ జంట జలాశయాలను నిర్మించారని ఆయన గుర్తుచేశారు. తాగునీటి సమస్యల పరిష్కారం కోసం పీజేఆర్ ఎన్నో పోరాటాలు చేశారని ఆయన స్మరించుకున్నారు. రూ. 7,360 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సమస్యలు ఎదురైనా సమన్వయంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఈ పథకాన్ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. త్వరలోనే మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రిని కలుస్తానని తెలిపారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికలు... బీఆర్ఎస్ బాటలో మరో పార్టీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌కు దూరంగా ఉండాలని ఒడిశాకు చెందిన కీలక ప్రాంతీయ పార్టీ బిజూ జనతాదళ్ (బీజేడీ) నిర్ణయించింది. బీఆర్ఎస్ ఇప్పటికే ఇదే వైఖరిని ప్రకటించగా, తాజాగా బీజేడీ కూడా ఆ జాబితాలో చేరింది. రేపు జరగనున్న ఓటింగ్‌లో తమ పార్టీ ఎంపీలు పాల్గొనబోరని బీజేడీ రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రా ఢిల్లీలో వెల్లడించారు. ఈ అంశంపై పార్టీ ఎంపీలు, రాజకీయ వ్యవహారాల కమిటీతో చర్చించిన అనంతరం బీజేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ తుది నిర్ణయం తీసుకున్నారని సస్మిత్ పాత్రా తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమికి సమాన దూరం పాటించాలన్న తమ పార్టీ విధానానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. తమ పూర్తి దృష్టి ఒడిశా రాష్ట్ర అభివృద్ధి, 4.5 కోట్ల మంది ప్రజల సంక్షేమంపైనే కేంద్రీకృతమై ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాజ్యసభలో బిజూ జనతాదళ్‌కు ఏడుగురు సభ్యుల బలం ఉంది. రేపు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి బరిలో ఉన్నారు. రెండు కూటములకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో రెండు ముఖ్యమైన ప్రాంతీయ పార్టీలు ఈ ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## జీ20 దేశాల్లో భారత్‌దే రికార్డ్.. నిరుద్యోగ రేటు కేవలం 2 శాతమే

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** భారతదేశం ఉద్యోగ కల్పనలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని, ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన జీ20 దేశాలతో పోలిస్తే మన దేశంలోనే నిరుద్యోగ రేటు అత్యల్పంగా ఉందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్) విడుదల చేసిన 'ది ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025' ప్రకారం భారతదేశంలో నిరుద్యోగ రేటు కేవలం 2 శాతంగా నమోదైందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాండవీయ ప్రసంగించారు. దేశ ఆర్థిక వృద్ధికి అనుగుణంగా అన్ని రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని, ప్రభుత్వ పథకాలు ఇందుకు ఎంతగానో దోహదపడ్డాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ కెరీర్ సర్వీస్ (ఎన్సీఎస్) పోర్టల్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు 'మెంటర్ టుగెదర్', 'క్విక్కర్' సంస్థలతో కార్మిక మంత్రిత్వ శాఖ అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది. ప్రస్తుతం ఎన్సీఎస్ పోర్టల్‌లో దాదాపు 52 లక్షల కంపెనీలు, 5.79 కోట్ల మంది ఉద్యోగార్థులు రిజిస్టర్ చేసుకున్నారని మంత్రి వివరించారు. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 7.22 కోట్ల ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రస్తుతం 44 లక్షలకు పైగా ఉద్యోగాలు యాక్టివ్‌గా ఉన్నాయని ఆయన తెలిపారు. ఉద్యోగ సమాచారం అందించడమే కాకుండా ఉపాధికి సంబంధించిన అన్ని సేవలకు దీనిని ఒకే వేదికగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు పెద్దపీట వేసిందని మాండవీయ గుర్తుచేశారు. యువతలో నైపుణ్యం, ఉపాధి కోసం రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్‌తో ఐదు ప్రధాన పథకాలను ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా, రూ. 99,446 కోట్ల కేటాయింపులతో ప్రారంభించిన 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (పీఎం వీబీఆర్‌వై) ద్వారా రాబోయే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యమని పేర్కొన్నారు. వీరిలో 1.92 కోట్ల మంది తొలిసారిగా ఉద్యోగాల్లో చేరే యువత ఉంటారని అన్నారు. కొత్తగా కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా ఉద్యోగార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. 'మెంటర్ టుగెదర్' భాగస్వామ్యంతో మొదటి ఏడాదిలోనే 2 లక్షల మంది యువతకు వ్యక్తిగత కెరీర్ మార్గదర్శకత్వం అందించనున్నారు. ఇక 'క్విక్కర్' ఒప్పందం ద్వారా దేశవ్యాప్తంగా 1,200 నగరాల నుంచి రోజూ 1,200కు పైగా ఉద్యోగ ప్రకటనలను ఎన్సీఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఇది గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.


## 70కి పైగా బీసీ కుల సంఘాల నేతలతో కవిత భేటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, ఇందుకోసం ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కుల సంఘాల నాయకులతో ఈరోజు ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పటివరకు పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె దుయ్యబట్టారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని బీసీ సంఘాలను కలుపుకొని, రిజర్వేషన్ల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరే వరకు తమ పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు ప్రధానంగా చర్చించారు.

## భారత్‌ను చూసి నేర్చుకోండి.. మోదీ పాలసీపై ఇజ్రాయెల్ నిపుణుడి ప్రశంసలు


**ఇజ్రాయెల్, సెప్టెంబర్ 08 :** అంతర్జాతీయ సంబంధాల్లో 'దేశ గౌరవాన్ని' ఒక వ్యూహాత్మక ఆస్తిగా ఎలా కాపాడుకోవాలో భారత్ నుంచి ఇజ్రాయెల్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆ దేశానికి చెందిన ప్రముఖ రక్షణ రంగ నిపుణుడు జకి షలోమ్ అభిప్రాయపడ్డారు. మిస్‌గవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ సెక్యూరిటీలో సీనియర్ ఫెలోగా పనిచేస్తున్న ఆయన, 'జెరూసలెం పోస్ట్'కు రాసిన ఒక వ్యాసంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని కొనియాడారు. పాకిస్థాన్‌తో ఘర్షణలు, అమెరికా విధించిన టారిఫ్‌ల వంటి క్లిష్ట సమయాల్లో ప్రధాని మోదీ దృఢమైన వైఖరిని ప్రదర్శించారని షలోమ్ గుర్తుచేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను కూడా మాట్లాడేందుకు నిరాకరించడం ద్వారా, తన దేశ గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారనే బలమైన సందేశాన్ని మోదీ పంపారని ఆయన వివరించారు. "దేశ గౌరవం అనేది కేవలం విలాసవంతమైన విషయం కాదు, అదొక కీలకమైన వ్యూహాత్మక ఆస్తి. మోదీ చర్యలు కఠినంగా అనిపించినా, భారత్‌ను తక్కువగా చూడటాన్ని అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు" అని షలోమ్ తన వ్యాసంలో పేర్కొన్నారు. మరోవైపు, ఖాన్ యూనిస్‌లోని నాస్సెర్ ఆసుపత్రిపై దాడి విషయంలో ఇజ్రాయెల్ వైఖరి గందరగోళంగా, ఆత్రుతతో కూడుకున్నదిగా ఉందని ఆయన విమర్శించారు. ఇజ్రాయెల్ స్పందన కారణంగా అమాయకులను చంపామన్న సంకేతాలు ప్రపంచానికి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దాడిలో 20 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ప్రదర్శిస్తున్న నిబద్ధత, స్పష్టత ఇజ్రాయెల్‌కు ఆదర్శం కావాలని షలోమ్ సూచించారు.

## కవిత సస్పెన్షన్‌పై తొలిసారి పెదవి విప్పిన కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, తన సోదరి కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో కవిత సస్పెన్షన్ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. కవిత సస్పెన్షన్‌పై ఆయన మొదటిసారిగా స్పందించారు. "కవితపై మా పార్టీ చర్చించి చర్యలు తీసుకుంది. చర్యలు తీసుకున్న తర్వాత ఇక నేను మాట్లాడటానికి ఏమీ లేదు" అని ఆయన స్పష్టం చేశారు. కవితపై వేటు అనేది పార్టీ అంతర్గతంగా చర్చించి తీసుకున్న నిర్ణయమని, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత వ్యక్తిగతంగా తాను దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని ఆయన తేల్చి చెప్పారు. పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకున్నాక, దాని గురించి మాట్లాడి, విషయాన్ని పొడిగించదలుచుకోలేదని అన్నారు.


## కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది.. మీనాక్షి నటరాజన్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** కామారెడ్డి సాక్షిగా చేసిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. ఇవాళ నగరంలోని గాంధీ భవన్‌లో టీపీపీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. టీపిసిసి అధ్యక్షుడిగా విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న మహేష్ కుమార్ గౌడ్‌కు ఆమె ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తాను పార్టీ ఇంచార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించడం శుభ పరిణామమని అన్నారు. వచ్చే విస్తృత స్థాయి సమావేశాలు జిల్లాల్లో నిర్వహించేలా ప్లాన్ చేస్తామని పేర్కొన్నారు. ప్రతి కమిటీలో సోషల్ జస్టిస్‌కు అనుగుణంగా ఎంపిక ఉంటుందని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో 70 నుంచి 80 శాతం పాత వారికి పదవులు ఇచ్చామని, మిగిలిన 20 శాతం కొత్త వారికి అవకాశం కల్పించామని అన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేసేందుకు కష్టతరమైన సరే.. కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని పార్టీ యోచిస్తోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఓసీ అయినప్పటికీ.. బలహీనవర్గాలకు చెందిన మహేష్ గౌడ్‌తో కలిసి సమన్వయంతో పనిచేస్తూ ముందుకు వెళ్తుండటం అభినందనీయమని కొనియాడారు. 90 శాతం ప్రజలకు ప్రభుత్వ పథకాల లబ్ధి జరుగుతోందని అన్నారు. వచ్చే నెల నుంచి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై పూర్తిగా దృష్టి సారిస్తామని అన్నారు. డీసీసీ కమిటీలు వచ్చే వారంలో పూర్తి అవుతాయని తెలిపారు. ఇక గ్రామ స్థాయిలో 'ఓట్ చోరీ'పై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామ అధ్యక్షుల ఎంపిక మూడు నెలల్లో పూర్తి చేస్తామని, కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. ఈ నెల 15న జరిగే కామారెడ్డి సభను విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లీడర్‌షిప్ ప్రోగ్రామ్స్ రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా సాగాయని మీనాక్షి నటరాజన్ తెలిపారు.

# అవినీతినే తన స్టాంపుగా మార్చుకున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ..

- దేశంలోనే ఒక ప్రమాదకర సమస్యగా పరిణమించిన వైనం..
- ప్రజలతో నేరుగా సంబంధం కలిగిన శాఖ ఇది..
- లంచాలు లేనిదే ఏపనీ కాదన్నది యాదార్ధవాదం..
- నిబంధనలలోని లోపాలను అనుకూలంగా మార్చుకుంటున్న అవినీతిపరులు..
- నిషేధిత భూములను యథేచ్ఛగా రిజిస్ట్రేషన్ చేస్తున్న దారుణం..
- తప్పుడు పత్రాలు, నకిలీ పత్రాలతో నిస్సిగ్గుగా లావాదేవీలు..
- తమ విశిష్ట అధికారాలను దుర్వినియోగం చేస్తున్న అవినీతి ఆఫీసర్లు..
- చట్ట విరుద్ధమైన పనులు చేయడానికి ఎవరూ వెనుకంజ వేయడం లేదు..
- ప్రభుత్వ పెద్దలే ప్రోత్సహిస్తున్నారన్నది బహిరంగ రహస్యం..
- రాజకీయ నాయకుల ప్రమేయంతో అడుగడుగునా అరాచకమే..
- ఈ శాఖలో అవినీతిని అరికట్టకపోతే ఎన్నెన్నో అనర్ధాలు ఎదురయ్యే ప్రమాదం..
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ పూర్తిగా ప్రక్షాళన జరగాలి..
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ



(స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతి అనేది ఒక్క తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే కాకుండా భారతదేశంలోనే ఒక పెద్ద సమస్యగా పరిణమించింది.. విశేషం ఏమిటంటే ఈ శాఖ ప్రజలతో నేరుగా సంబంధం కలిగి ఉంటుంది కాబట్టి, ఇందులో అవినీతికి అనేక అవకాశాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలలో అయితే ఈ పరిస్థితి మరీ దారుణంగా వుంది.. అయితే ఈ అవినీతి ఎలా జరుగుతుందో..? దాని వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి కొన్ని అంశాలు చూసినప్పుడు ఆందోళన కలుగక మానదు..

*** అవినీతికి కొన్ని ప్రధాన కారణాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం :**

**నిబంధనలలో లోపాలు :**

కొన్నిసార్లు నిబంధనలలో ఉండే లొసుగులను ఉపయోగించుకుని అధికారులు అక్రమాలకు పాల్పడతారు. నిషేధిత భూముల రిజిస్ట్రేషన్, తప్పుడు పత్రాల ద్వారా లావాదేవీలు వంటివి ఇబ్బడి ముబ్బడిగా జరుగుతున్నాయి.

**అధికార దుర్వినియోగం :**

కొందరు సబ్ రిజిస్ట్రార్లు, ఇతర ముఖ్యమైన అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ డైరెక్ట్ గానే లంచాలు డిమాండ్ చేస్తున్నారు.. పనులు త్వరితగతిన చేయడానికి, లేదా చట్టానికి విరుద్ధంగా పనులు చేయడానికి లంచం రూపంలో డబ్బులు అడుగుతున్నారు..




**ముఖ్యమైనది దళారుల వ్యవస్థ :**

రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో డాక్యుమెంట్ రైటర్లు, దళారీలు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరు నేరుగా ప్రజల నుంచి డబ్బు వసూలు చేసి, ఆ మొత్తాన్ని అధికారులకు పంపిణీ చేస్తారు. ఈ దళారుల వ్యవస్థ అవినీతికి ప్రధాన కేంద్రంగా నిలుస్తోంది..

**ఆన్‌లైన్ వ్యవస్థలో లోపాలు :**

ప్రభుత్వం ఆన్‌లైన్ వ్యవస్థలను ప్రవేశపెట్టినా, అందులో కూడా అవినీతికి అవకాశాలు ఎన్నో కనిపిస్తున్నాయి. ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్, పత్రాల ధృవీకరణ వంటి వాటిలో కూడా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి..

*** ఈ అవినీతి జాడ్యం వల్ల ఎన్నెన్నో నష్టాలు :**

ముఖ్యంగా ప్రజలకు ఆర్థిక నష్టం విపరీతంగా జరుగుతోంది.. రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు అడిగినంత డబ్బు చెల్లించాల్సి వస్తోంది. ఇది వారికి అనవసరమైన ఆర్థిక భారాన్ని మోపుతుంది.

**ఇక ప్రభుత్వానికి ఆదాయ తీరని నష్టం :**

సరైన స్టాంప్ డ్యూటీ, ఇతర ఛార్జీలు చెల్లించకుండా తక్కువ మొత్తంలో రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. దీంతో అవినీతి అధికారుల జేబులు నిండుతున్నాయి.. ప్రభుత్వం నుంచి జరగాల్సిన అభివృద్ధి పనులకు తీవ్రమైన ఆటంకం కలుగుతోంది..

**న్యాయపరమైన వివాదాలు :**

తప్పుడు పత్రాలు లేదా నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల వల్ల భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తుతాయి. ఇది ప్రజల మధ్య గొడవలకు, కోర్టు కేసులకు దారితీస్తుంది. ఒక్కోసారి ప్రాణాలు తీసేంత భయంకర పరిస్థితులు కూడా ఎదురవుతాయి.. ఇలాంటి ఉదంతాలు ఎన్నెన్నో చూశాం..


**ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతుంది :**

ఈ శాఖలో అవినీతి ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలపై ఉన్న విశ్వాసాన్ని తగ్గిస్తుంది.. ఇప్పటికే ఈ ప్రమాదం నెలకొని ఉంది..

*** నామ మాత్రంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు:**

అవినీతిని తగ్గించడానికి ప్రభుత్వం కొన్ని సంస్కరణలు చేపడుతోంది. పారదర్శకతను పెంచడం, ఆన్‌లైన్ సేవలను మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకుంటున్నాయి. ఏసీబీ అంటే అవినీతి నిరోధక శాఖ దాడులు కూడా నిరంతరం జరుగుతున్నాయి. అయినప్పటికీ, అవినీతి పూర్తిగా నిర్మూలించబడలేదన్నది అక్షర సత్యం.. ఇందుకు ప్రతి నిత్యం మనం చూస్తున్న వార్తా కథనాలు సాక్షం..

మొత్తానికి, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతి ఒక వ్యవస్థీకృత సమస్యగా మారింది. ఇది ప్రజలను ఆర్థికంగా, న్యాయపరంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించడానికి కఠినమైన చర్యలు, పారదర్శక వ్యవస్థలు, ప్రజలలో అవగాహన పెంపొందించడం అవసరం అని సూచిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "...



## తెలంగాణ గ్రూప్ 1 పిటిషన్లపై తీర్పు వెలువరించనున్న హైకోర్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 పిటిషన్లపై హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. మూల్యాంకనాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు నేతృత్వంలోని ధర్మాసనం ఇప్పటికే విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం గతంలో తీర్పును రిజర్వ్ చేసింది.

## తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది


**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** బ్యారేజీల భద్రత, వినియోగాన్ని నిర్ధరించేందుకు వర్షాకాలం ముందే చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తుమ్మిడిహట్టి కోసం సవరించిన డీపీఆర్, ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మహారాష్ట్రతో చర్చల కోసం షెడ్యూల్ ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఉత్తమ్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. సమ్మక్క సారక్క ఆనకట్ట విషయంపై ఈ నెల 23న టీఏసీ సమావేం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నివేదిక సమర్పించడంతోపాటు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ కోసం ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. పీఎంకేఎస్‌వై పథకం ద్వారా నిధుల కోసం కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణలో ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం ముందుకెళ్తామని అన్నారు. వరద తగ్గిన వెంటనే ఐఐటీ లాంటి సంస్థలతో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ''పాలమూరు, రంగారెడ్డి, జూరాల, కల్వకుర్తి ప్రాజెక్టులను ప్రాధాన్యంగా పరిగణించాలి. 4 ప్రాజెక్టుల భూ సేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలి. డిండి, ఎస్ఎల్‌బీసీ, పెండ్లిపాక, నక్కలగండి, కొడంగల్ నారాయణపేట ప్రాజెక్టుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. భూసేకరణ వేగవంతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. దేవాదుల ప్రాజెక్టు 3, 6 ప్యాకేజీల పనులు వేగవంతం చేయాలి. తదుపరి కేబినెట్ సమావేశానికి పురోగతి నివేదిక సమర్పించాలి. అన్ని ప్రాజెక్టుల్లో దశలవారీగా పూడికతీతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి'' అని ఉత్తమ్ సూచించారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ పనుల కోసం హెలిబోర్న్ సర్వే విషయంపై ఎన్జీఆర్ఐ, హిమాలయన్ హెలీ సర్వీసెస్, జేపీ అసోసియేట్స్ ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృశ్యమాధ్యమ సమీక్ష



నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ వద్ద 2 హెలిప్యాడ్‌లను సర్వే కోసం ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. డీజీసీఏ, ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధ్యయనాలు కొనసాగించాలన్నారు.

## హైదరాబాద్‌లో రద్దయిన పెద్ద నోట్లు పట్టివేత...

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** నగరంలో రద్దయిన పెద్ద నోట్లు భారీ మొత్తంలో పట్టుబడ్డాయి. నారాయణగూడ శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంక్ వద్ద ఇద్దరిని, వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఇద్దరిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 3 బ్యాగుల్లో తనిఖీలు చేయగా.. రూ. 2 కోట్లు విలువ చేసే రద్దయిన రూ.500, రూ.1000 నోట్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. తదుపరి విచారణ నిమిత్తం



నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి అవసరం

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ''ఎన్నికల ముందు పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వ పదవిలో ఏదో ఒకటి తప్పకుండా వస్తుంది.



కాంగ్రెస్ పార్టీ అజేయంగా ఉండేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేపట్టే ప్రతి పనికి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కేబినెట్ అంతా అండగా ఉంటుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించేందుకు, సవాళ్లను ఎదుర్కొని న్యాయం చేసేందుకు ముందుకు వెళ్తున్నాం. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితిని భారత రాష్ట్ర సమితి పెట్టింది. 42 శాతం రిజర్వేషన్ బిల్లును భాజపా రాష్ట్రపతి దగ్గర ఆపింది. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి, భాజపా కుట్ర దాగి ఉంది''అని భట్టి విమర్శించారు.

## బీసీ రిజర్వేషన్లు అమలు చేయలేక కేంద్రంపై ఆరోపణలు.. బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు హాట్ కామెంట్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (భారత శక్తి) :** రాష్ట్ర కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లు అమలు చేయలేక కేంద్ర ప్రభుత్వంపై నెపం వేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. బీసీలకు ఏమీ చేయని కాంగ్రెస్ నాయకులు తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని హాట్ కామెంట్స్ చేశారు. సోమవారం తమ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి బీసీ సామాజిక వర్గానికి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే అది న్యాయపరమైన ప్రక్రియను పాటిస్తూ, చిత్తశుద్ధితో మాత్రమే సాధ్యమయ్యేదన్నారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలంటే 2018 పంచాయతీ రాజ్ చట్టం సవరణ చేయాల్సి ఉంది. కానీ కాంగ్రెస్ నేతలులు దీనిని అర్థం చేసుకోలేక బీజేపీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం అంటూ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ చేసింది బీసీ డిక్లరేషన్ కాదని బీసీలకు ద్రోహమని మండిపడ్డారు. నిజంగా చట్టబద్ధతను పాటించాలనుకుంటే ఎందుకు 22 నెలలు ఆలస్యం చేసిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. అబద్ధపు వాగ్దానాలు, మోసపూరిత చర్యలతో, తెలంగాణ ప్రజలు, బీసీలను మోసం చేస్తోంది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం, శాస్త్రీయ పద్ధతిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దాకా బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదనే విషయం గుర్తుంచుకోవాలని హితువు పలికారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగిసి ఏడాదిన్నర గడిచింది. అయినప్పటికీ, ప్రభుత్వం రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా ఆలస్యం చేయడం దారుణమన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ (Congress) పరిపాలన వల్ల తీవ్ర నష్టం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ కేంద్రం మెడలు వంచడం కాదు బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ భరతం పట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుగ్లక్ కంటే ఘోరమైన పరిపాలన చేస్తోంది. 17 సెప్టెంబరు తెలంగాణ విమోచన దినోత్సవాలను ఈ ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో అధికారికంగా నిర్వహించనుంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాల్గొని జాతీయ జెండా ఎగర వేయనున్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.